KR TV

మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 | సంచిక :103 | గురువారం 13 మార్చి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 | వెల: 3 రూ/-

## తెలంగాణ ప్రజల

# కలల సాకారానికే బడ్జెట్

### గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. సభ ప్రారంభం కాగానే గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉభయసభలను ఉద్దేశించి మాట్లాడారు. సమావేశాలకు ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల కలల సాకారానికే ఈ బడ్జెట్ ప్రవేశపెడుతున్నామన్నారు. ప్రజలే కేంద్రం పాలన సాగుతోందని, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులు, మహిళలు, యువతకు అన్ని విధాలా సహకారం అందిస్తామని చెప్పారు.

రైతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఘనమైన సంస్కృతికి నిలయం తెలంగాణ అని పేర్కొన్నారు. ప్రజల కోసం గద్దర్, అంజయ్య వంటి ఎందరో కృషి చేశారని, జననీ జయకేతనం రాష్ట్ర గీతంగా చేసుకున్నామన్నారు. సామాజిక న్యాయం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ తెలిపారు.

సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నామని, అభివృద్ధి, ప్రగతి వైపు తెలంగాణ అడుగులు వేస్తోందని జిష్ణుదేవ్ వర్మ తన ప్రసంగంలో పేర్కొన్నారు. రాష్ట్రానికే రైతులే ఆత్మ అని.. వారి అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల కోసం నిరంతరం శ్రమించే వారే అన్నదాతలని.. రాష్ట్ర అభివృద్ధిలో రైతుల భాగస్వామ్యం ఉందని, రైతులకు మద్దతు ఇవ్వడం, వారిని శక్తివంతులుగా తీర్చిదిద్దే బాధ్యత తమ ప్రభుత్వానిదేనన్నారు.

2 లో

# గవర్నర్లు మారారు తప్ప.. ప్రసంగాలు మారలేదు : హరీశ్‌రావు



2 లో

క్రాంతిన్యూస్ / అసెంబ్లీలో గతేడాది గవర్నర్ ప్రసంగానికి.. ఈ సారి గవర్నర్ ప్రసంగానికి తేడా ఏం లేదని.. గవర్నర్లు మారడం తప్ప.. ప్రసంగాలు మారలేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. చేయనివి చేసినట్లు, ఇవ్వని ఇచ్చినట్లుగా అబద్ధాలు, అవాస్తవాలతో కూడిన ప్రసంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్‌తో చెప్పించిందన్నారు. గవర్నర్ ప్రసంగంపై మాజీ మంత్రి హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. ఏడాదిన్నర ప్రభుత్వ పాలనా వైఫల్యానికి గవర్నర్ ప్రసంగం నిదర్శనమన్నారు. రేవంతు అబద్దాల ప్రచారాన్ని నమ్మించేందుకు గవర్నర్‌ను వాడుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. గవర్నర్ మహాత్మా గాంధీ చెప్పిన మాటలతో 32 పేజీల ప్రసంగం మొదలు పెట్టారని.. 'నిన్ను నువ్వు కనుగొనడానికి అత్యుత్తమ మార్గం ఇతరుల సేవలో నిమగ్నమవ్వడమే' అని.. నిజానికి రేవంత్ రెడ్డి అత్యుత్తమ మార్గం ఢిల్లీ, చంద్రబాబు సేవలో నిమగ్నం అయ్యాడని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారన్నారు. ట్రాన్స్ ఫార్మింగ్ లైవ్స్ అన్నారని.. ఎవరి లైవ్స్ ట్రాన్స్ ఫార్మ్ చేశారని ప్రశ్నించారు.

# 27 వరకు అసెంబ్లీ సమావేశాలు..

### 19న బడ్జెట్, ఆ కీలక బిల్లులకు ఆమోదం..!



2 లో

తెలంగాణలో అసెంబ్లీ సమావేశాలు మొదలయ్యాయి. ఈ అసెంబ్లీ సమావేశాలు మార్చి 27వ తేదీ వరకు కొనసాగించాలని బీఏసీ నిర్ణయించింది. బుధవారం అసెంబ్లీ సమావేశాలు మొదలవగా.. గవర్నర్ ప్రసంగం అనంతరం స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశం నిర్వహించారు.

# కాంగ్రెస్ కార్యకర్త ప్రసంగం మాదిరిగా గవర్నర్ ప్రసంగం -కేటీఆర్

క్రాంతిన్యూస్ / తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అసెంబ్లీలో ప్రసంగించారు. అయితే అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విమర్శలు చేశారు. కాంగ్రెస్ కార్యకర్త ప్రసంగం మాదిరిగా గవర్నర్ ప్రసంగముందని విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో కేటీఆర్ మాట్లాడారు. గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్త ప్రసంగం మాదిరిగా గవర్నర్



2 లో

ప్రసంగముందని విమర్శించారు. కాంగ్రెస్ సర్కార్ గవర్నర్‌ను కూడా అవమానించింది, మోసం చేసిందని మండిపడ్డారు. రుణమాఫీ, రైతు భరోసాపై గవర్నర్‌తో అబద్దాలు చెప్పించారని అన్నారు. తెలంగాణలోని ఒక్క గ్రామంలో కూడా వందశాతం రుణమాఫీ కాలేదని ధ్వజమెత్తారు. రుణమాఫీపై సీఎం రేవంత్‌తో చర్చకు రెడీ అని కేటీఆర్ సవాల్ విసిరారు.

# ప్రాణం పోయినా కేసీఆర్‌తోనే ఉంటా

### ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



2 లో

# మా సిఫార్సు లేఖలను టీటీడీ పట్టించుకోవట్లేదు

### -మంత్రి కొండా సురేఖ



2 లో

తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల సిఫార్సు లేఖలను టీటీడీ పట్టించుకోవడం లేదని మంత్రి కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఏపీ సీఎం చంద్రబాబుకు లెటర్ రాశారు.

## గవర్నర్ ప్రసంగంలో

# కొత్తదనం లేదు

### : ఎమ్మెల్సీ కవిత



2 లో

# రాజకీయ పార్టీలకు భట్టి,జనారెడ్డి బహిరంగ లేఖ



2 లో

క్రాంతిన్యూస్ /రాజకీయ పార్టీలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ నేత జానారెడ్డి బహిరంగ లేఖ రాశారు. నియోజకవర్గాల పునర్విభజనపై త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని.. ప్రతి పార్టీని ఆహ్వానిస్తామని తెలిపారు.జనాభా ప్రాతిపదికన జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనతో రాష్ట్రానికి ప్రమాదం పొంచి ఉందని.. జరగబోయే నష్టం గురించి అన్ని పార్టీలను ఆహ్వానించి చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని లేఖలో పేర్కొన్నారు.

## కేసీఆర్ మాకు వారసత్వంగా ఇచ్చింది

# అప్పులు తప్పులు

### సీఎం రేవంత్ రెడ్డి



2 లో

క్రాంతిన్యూస్/ జూనియర్ లెక్చరర్, పాలిటెక్నిక్ లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపికైన 1,532 మందికి సీఎం రేవంత్ రెడ్డి ఈ రోజు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యోగ నియామక పత్రాలు అందుకుంటున్న అందరికీ అభినందనలు తెలిపారు. ఇది మీకు కేవలం ఉద్యోగం మాత్రమే కాదు.. ఒక భావోద్వేగమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో నిరుద్యోగుల పాత్ర క్రియాశీలకమైందన్నారు. కానీ గత ప్రభుత్వం నిరుద్యోగుల విషయంలో చిత్తశుద్ధి చూపలేదని ఫైర్ అయ్యారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటులో నిరుద్యోగుల కృషి, పట్టుదల ఉందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నిరుద్యోగుల జీవితంలో పన్నెండేళ్ళు వృథా అయిందని ఫైర్ అయ్యారు. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 55,163 ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. తెలంగాణ ఉద్యమానికి పునాదిగా మారిన నిరుద్యోగుల సమస్యకు తాము శాశ్వత పరిష్కారం చూపామన్న సంతృప్తి ఉందన్నారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందన్నారు. దేశ ఆర్థిక భవిష్యత్ విద్యాశాఖతో ముడిపడి ఉందన్నారు. అలాంటి శాఖలో మీరు ఉద్యోగ నియామక పత్రాలు అందుకోవడం గొప్ప విషయమన్నారు.

# నేటిమాట

నేను ఒక సమాజం పురోగతిని ఆ సమాజంలో మహిళలు సాధించిన పురోగతిని ఆధారంగా కొలుస్తాను



డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్

# ప్రశ్నించడం ఏమైనా రాజద్రోహమా?..

### సీఎం రేవంత్ రెడ్డిని నిలదీసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



2 లో

క్రాంతిన్యూస్ / మహిళా జర్నలిస్టు రేవతి అరెస్టును బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. ఉదయం 5 గంటలకు ఒక మహిళా జర్నలిస్టును అరెస్టు చేయాల్సిన అవసరం ఏముందని ఆయన నిలదీశారు. ప్రజాపాలనలో ప్రజలపై ప్రతీకారం ఎందుకు అని ప్రశ్నించినందుకేనా అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. అలా ప్రశ్నించడం ఏమైనా రాజద్రోహమా? ఉగ్రవాదమా అని అడిగారు. రాహుల్ గాంధీ రోజూ వల్లెవేస్తున్న రాజ్యాంగంలోని 19వ అధికరణం చదవలేదా అని మండిపడ్డారు.

తెలంగాణలోని కొంతమంది అధికారులు నియంతృత్వ పాలకుల ఆదేశాలను గుడ్డిగా అనుసరిస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. వారు భవిష్యత్తులో అనివార్యమైన, పశ్చాత్తాపానికి గురికావాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. ఇలాంటి రాజ్యాంగ విరుద్ధమైన ఆదేశాలను గుడ్డిగా పాటించే ముందు.. అది నైతికమైనదా? కాదా? చట్టబద్ధత ఉందా? లేదా అనేదానిపై ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని సూచించారు. ఆ ఆదేశాలపై మీకు ఏమైనా సందేహాలు ఉంటే తటస్థ చట్టపరమైన అభిప్రాయాలను తీసుకోవాలన్నారు.

# అసెంబ్లీ సెక్రటరీపై

## మంత్రి పొన్నం ప్రభాకర్ సీరియస్

క్రాంతిన్యూస్ / తెలంగాణ అసెంబ్లీ సెక్రటరీపై మంత్రి పొన్నం ప్రభాకర్ అసహనం వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు కొత్త పాస్‌లు ఇవ్వకుండా.. ఇంకా పాత పాస్‌లతోనే అనుమతించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు బుధవారం ఉదయం 11 గంటలకు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాల కవరేజీకి వచ్చిన పలువురు జర్నలిస్టుల అసెంబ్లీ పాస్‌లను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. వారి దగ్గర పాత పాస్‌లే ఉండటం ఆయన గమనించారు. దీంతో ఈ విషయంపై అసెంబ్లీ సెక్రటరీ మీద పొన్నం ప్రభాకర్ అసహనం వ్యక్తం చేశారు. ఇంకా పాత కార్డులనే కొనసాగించడమేంటని ప్రశ్నించారు. కొత్త పాస్‌లు ఇంకెప్పుడు ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



2 లో

KR TV మన క్రాంతి ఇది వాస్తవ పత్రిక...



# తెలంగాణ ప్రజల కలల సాకారానికే బడ్జెట్

మొదటి పేజీ తరువాయి

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని.. రైతులకు రుణమాఫీ చేశామని, రైతుల రైతుల పట్ల మా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 25.35లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించామని.. ఎకరానికి రూ.12వేల చొప్పున రైతులకు అందిస్తున్నామని.. రైతునేస్తం అమలు చేస్తున్నట్లు చెప్పారు. వరి రైతులకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నామని, రైతుల కోసం వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహాలక్ష్మి గేమ్ ఛేంజర్ పథకమని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు చెప్పారు.తెలంగాణ పురోగమించడమే కాదు.. రూపాంతరం చెందుతోందన్నారు. సమ్మిళిత, స్వయం సమృద్ధి, సాధికార తెలంగాణ విజన్‌తో పని చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సమృద్ధికి దిక్సూచిగా ఉండేలా తెలంగాణ నమూనా ఉండాలని, తెలంగాణ భౌగోళిక పాత్రమే కాదు.. ఒక భావోద్వేగమన్నారు. తెలంగాణ స్థిరత్వం, దృఢసంకల్పానికి గుర్తు అన్నారు.రైతుల స్వేదం, కష్టం మన ప్రజలను పోషిస్తోందన్నారు. 260లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తితో దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని తెలిపారు. ఇది మన రైతుల స్థిరత్వం, అంకిత భావానికి ఓ సాక్ష్యమన్నారు. రూ.2లక్షల పంట రుణమాఫీని అమలు చేస్తున్నట్లు గవర్నర్ పేర్కొన్నారు. రుణమాఫీతో రూ.20,616.89కోట్లతో 25.35లక్షల మంది రైతులకు లబ్ధి కలిగిందన్నారు. ఇది ప్రభుత్వం చేసిన వాగ్దానాల నిర్దిష్ట కాల అమలుకు సాక్ష్యమన్నారు. రైతు భరోసా కింద నేరుగా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఏడాదికి ఎకరాకు రూ.12వేలకు పెంచినట్లు వివరించారు.

# గవర్నర్లు మారారు తప్ప.. ప్రసంగాలు మారలేదు :

మొదటి పేజీ తరువాయి

## హరీశ్‌రావు

ప్రజలు అభివృద్ధి చెందాలి.. కాంగ్రెస్ మంత్రులు కాదు..

లగచర్ల, న్యాల్కల్, అశోక్‌నగర్‌లో రైతులను, నిరుద్యోగులను పోలీసులతో కొట్టించడం, ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం ఇదేనా మీరు చెప్పిన ట్రాన్స్ ఫార్మింగ్ లైవ్స్ అంటూ నిలదీశారు. ఇవాళ ఇద్దరు జర్నలిస్టులను అరెస్టు చేసి ప్రజాపాలన పేరుతో పెద్ద ట్రాన్స్ ఫార్మేషన్ చేశారని ఎద్దేశా చేశారు. ఇంక్లూసివ్ డెవలప్‌మెంట్ అంటే అన్ని వర్గాల ప్రజల డెవలప్‌మెంట్ కావాలని.. అంతే గానీ కాంగ్రెస్ మంత్రులు, నాయకుల డెవలప్‌మెంట్ కాదంటూ చురకలంటించారు. 20శాతం కమీషన్లు తీసుకోవడమేనా? మీరు చెప్పిన ఇంక్లూసివ్ డెవలప్‌మెంట్ అంటూ ధ్వజమెత్తారు. ప్రజల సేవ ఎక్కడిది.. స్వయం సేవా, ఢిల్లీ సేవలో రేవంత్ రెడ్డి, మంత్రి వర్గం తరిస్తుందన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్చారని.. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టే చోట రాహుల్ గాంధీ తండ్రి విగ్రహం పెట్టారని ఆరోపించారు. తెలంగాణ సంస్కృతి అభివృద్ధికి చేపట్టిన చర్యలుగా భావించాలా? అని ప్రశ్నించారు. వ్యవసాయం పెంచింది ఎవరు.. గొప్పలు చెబుతున్నది ఎవరు? అని నిలదీశారు.

కోటి ఎకరాల మాగాణంగా మార్చింది కేసీఆర్ కాదా?

34లక్షల ఎకరాల నుంచి కోటి ఎకరాల మాగాణంగా మార్చింది కేసీఆర్ కాదా? కాళేశ్వరం సహా ఇతర ప్రాజెక్టులు, మిషన్ కాకతీయతో అది సాధ్యమైందన్నది వాస్తవమన్నారు. గొప్పగా చెప్పిన 260 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి రికార్డు కేసీఆర్ పదేళ్ల కృషితో సాధ్యమైందా? ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో సాధ్యమైందా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ అనేది పెద్ద బోగస్ అని, రూ.41వేల కోట్ల రుణమాఫీ అని చెప్పి.. బడ్జెట్‌లో రూ.31వేల కోట్లు చెప్పి, 20వేలకోట్లు అంటూ ప్రచారం చేసుకుంటున్నారన్నారు. రైతు భరోసా రూ.15వేలు ఇస్తమని, సిగ్గులేకుండా రూ.12వేలకు తగ్గించారని.. దాన్ని గొప్పగా గవర్నర్ ప్రసంగంలో చెప్పుకున్నారని విమర్శించారు. రైతు కూలీలకు రూ.12వేలు ఇస్తున్నామని పచ్చి అబద్ధాలు గవర్నర్‌తో చెప్పించారన్నారు. ఇప్పటి వరకు కనీసం రూపాయి అయినా ఎవరి ఖాతాల్లో అయినా పడిందా? అని ప్రశ్నించారు.

రైతు వేదికలు కట్టింది ఎవరు?

అసలు 566 రైతు వేదికలు కట్టింది ఎవరు ? అది కూడా మీ ఘనతేనా? అని నిలదీశారు. కేసీఆర్ చేసింది కూడా కేసీఆర్ ముందే మీ ఘనత గా చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. చేనేతలకు ఉన్న పథకాలన్నీ రద్దు చేసి.. వాళ్లను బలహీనం చేసి.. దెబ్బతీసి.. ఇప్పుడు కొత్త పథకాన్ని ప్రకటించారన్నారు. రుణమాఫీ, రైతు భరోసాలాగానే ఈ పథకం అమలు అంతేనా? అంటూ అనుమానం వ్యక్తం చేశారు. అన్ని పంటలకు బోనస్ అని చెప్పి సన్నాలకు పరిమితం చేశారని, ఇంకా రూ.400కోట్లు పెండింగ్ ఉందని.. రూ.1200 కోట్లు ఇచ్చామనడం పచ్చి అబద్ధమన్నారు. మీరు ఏర్పాటు చేసిన వ్యవసాయ కమిషన్ ఏం చేసిందని.. యాసంగిలో పంటలు వేయకండి అని చెప్పిందని.. అంతకు మించి చేసిన పనేంటి అంటూ నిలదీశారు. 445 రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. కనీసం రైతు బీమా డబ్బులు కూడా ఇవ్వడం లేదన్నారు.

జాబ్ క్యాలెండర్ పేరు చెప్పి.. జాబ్ లెస్ క్యాలెండర్ చేశారని హరీశ్‌రావు విమర్శించారు. నిరుద్యోగ భృతి ఊసే లేదని.. ఏటా 2లక్షల ఉద్యోగాలని యువతను మోసం చేశారన్నారు. కృష్ణా జలాల గురించి గొప్పలు చెబుతున్నారని, కృష్ణా జలాలు ఆంధ్రా దోచుకుపోతుంటే మౌనంగా ఉన్న మీరు దాని గురించి మాట్లాడటం సిగ్గుచేటరన్నారు. ఆరు గ్యారెంటీల్లో మహాలక్ష్మి మొదటి హామీ నెలకు రూ.2500 ఇప్పటికి దిక్కులేదని.. ఇంకా దీన్ని గేమ్ ఛేంజర్ అని చెప్పుకుంటున్నారన్నారు. ఎస్‌జీహెచ్‌లకు ఈ ఏడాది ఒక్క రూపాయి కూడా వడ్డీ లేని రుణాలు ఇవ్వలేదన్నారు. 55వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని అబద్ధాలు చెప్పారని.. పదివేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. విద్యావ్యవస్థ నిర్వీర్యం చేశారని.. గురుకులాల్లో 83 మంది విద్యార్థులు ప్రాణం కోల్పోయారని చెప్పారు.

ఆరోగ్యశ్రీ అమలు కావడం లేదని, పోలీసు భద్రత అమలు కావడం లేదని.. గొప్పలు మాత్రం చెప్పుకుంటున్నారని విమర్శించారు. సామాజిక న్యాయం.. బీసీలకు న్యాయం కోసం 42శాతం రిజర్వేషన్లు కల్పించడం కోసం బిల్లు పెడుతున్నారన్నారు. బీసీల కులగణన తప్పుల తడకగా చేసి.. ఇప్పుడు ఏ ప్రాతిపదికన బిల్లు పెడతారని ప్రశ్నించారు. తప్పుల కులగణన చేసిన రోజును సామాజిక న్యాయ దినోత్సవంగా ఎలా జరుపుతారన్నారు. కనీసం అంబేద్కర్ విగ్రహానికి దండ కూడా వేయని వాళ్లు సామాజిక న్యాయ దినోత్సవాన్ని జరుపుతారా? అంటూ నిలదీశారు. కుల సర్వే చేసినం అంటున్నారని.. ఆ సంఖ్య మీద బీసీ సంఘాలే అనుమానం వ్యక్తం చేస్తున్నాయని గుర్తు చేశారు. ప్రశ్నించిన వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడం తప్ప, వాస్తవ లెక్కలు బయటికి చెప్పడం లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ పూర్తి చేసి ఉద్యోగ నియమకాలు పూర్తి చేస్తమని ఇదే అసెంబ్లీలో రేవంత్ రెడ్డి ప్రకటించాడని.. ఇప్పటికీ ఒక్క అడుగు ముందు పడలేదన్నారు.

పెట్టుబడులు, పరిశ్రమలు వాపస్ పోతుంటే సిగ్గులేకుండా గొప్పలు చెబుతున్నారని, గుజరాత్, తమిళనాడు, ఆంధ్రాకు తెలంగాణకు వచ్చిన పరిశ్రమలు తరలిపోతున్నాయని మీడియా కోడై కూస్తుందని, లక్షా78వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని గొప్పలు చెబుతున్నారన్నారు. అసలు దావోస్‌లో జరిగే ఒప్పందాలు ఎక్స్ ప్రెషన్ ఆఫ్ ఇంటెంట్ అని మీ ఉప ముఖ్యమంత్రి చెప్పిందని.. ఇప్పటి వరకు మీరు చెప్పిన ఒప్పందాలు ఎన్ని గ్రౌండ్ అయ్యాయని.. శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎంఎస్ఎంఈలు ఇబ్బందులు పడుతుంటే.. కొత్త పాలసీ అని డబ్బా కొడుతున్నారని.. పోలీసు ఫ్యామిలీలు రోడ్డు ఎక్కాయని.. అయినా పోలీసు సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటున్నమని డబ్బా కొట్టారని మండిపడ్డారు. ముఖ్యమంత్రిపై పొగడ్తలతో గుదిగుచ్చి తయారుచేసిన ప్రసంగం ఇదని.. పాడిందే పాటరా అన్న చందంగా ఏడాది కాలంగా చెప్తున్నవే మళ్లీ మళ్లీ చెప్పి.. చెప్పించిన నిస్సారమైన ప్రసంగం అంటూ విమర్శించారు.

# గవర్నర్ ప్రసంగంలో కొత్తదనం లేదు : ఎమ్మెల్సీ కవిత

గవర్నర్ ప్రసంగంలో కొత్తం ఏమీ లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. గాంధీ కుటుంబానికి కేవలం ఎన్నికల సమయంలోనే తెలంగాణ గుర్తొస్తుందా ? అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం విఫలమవుతున్న నేపథ్యంలో గాంధీ కుటుంబం బాధ్యత తీసుకోవాలన్నారు. గాంధీ కుటుంబం సంతకాలు చేసిన గ్యారెంటీలను చూసే ప్రజలు ఓట్లు వేశారని.. స్థానిక కాంగ్రెస్ నాయకులను చూసి ప్రజలు ఓట్లు వేయలేదన్నారు.

బాధ్యత తీసుకొని గాంధీ కుటుంబం తెలంగాణ ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. గవర్నర్ ప్రసంగాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో గాంధీ కుటుంబం వచ్చి ఇచ్చిన హామీల అమలుపై ప్రస్తావనే లేదని.. అబద్ధాలనే మళ్లీ అందమైన భాషలో చెప్పే ప్రయత్నం చేశారని విమర్శించారు. సమావేశాల్లో ప్రభుత్వాన్ని ఎండగడుతామన్నారు. రూ.లక్షా50వేల కోట్ల అప్పులు చేసినా ఒక్క హామీని కూడా సంపూర్ణంగా అమలు చేయలేదని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్న హామీని విస్మరించిందని మండిపడ్డారు.

# 27 వరకు అసెంబ్లీ సమావేశాలు.. 19న బడ్జెట్, ఆ కీలక బిల్లులకు ఆమోదం..!

మొదటి పేజీ తరువాయి

మంత్రులతో పాటు విపక్ష పార్టీల నేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నుంచి హరీష్ రావు, ప్రశాంత్ రెడ్డి, బీఏసీ నుంచి ఏలేటి మహేశ్వర్ రెడ్డి, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. ప్రజాసమస్యలపై చర్చించేందుకు వీలైనన్ని ఎక్కువ రోజులు సభ నిర్వహించాలని విపక్షాలు కోరగా.. మార్చి 27వ తేదీ వరకు సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. 14న హోలీ, 16న ఆదివారం, 20, 23న సెలవులు ఉండటంతో.. ఈ నాలుగు రోజులు మినహాయించి మొత్తంగా 12 రోజుల పాటు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. అయితే.. ఈ అసెంబ్లీ సమావేశాల్లో 15 నుంచి 18 వరకు కులగణనపై చర్చ జరగనుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును 15వ తేదీన ప్రవేశపెట్టబోతోంది. 17, 18వ తేదీల్లో బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణపై ప్రత్యేకంగా చర్చించనున్నారు.మరోవైపు.. మార్చి 19వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సభలో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. 20వ తేదీన సెలవు కావటంతో.. 21, 22వ తేదీల్లో బడ్జెట్ మీద చర్చించనున్నారు. 24, 25, 26వ తేదీల్లో పద్దులపై చర్చలు జరుపుతారు. చివరగా 27వ తేదీన ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశ పెట్టనున్నారు.అయితే.. సభలో కృష్ణా జలాల హక్కు, రైతుల ఆత్మహత్యలు, రుణమాఫీ, రైతుభరోసా, స్థానిక సంస్థల నిధుల లేమి వంటి ప్రధాన అంశాలపై కూడా అసెంబ్లీ చర్చ జరగనున్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం తెలిపిన తర్వాత కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పార్లమెంట్‌లో ఆమోదం పొందేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ప్రయత్నాలు చేస్తోంది. దీంతో.. ఈ సమావేశాలు సర్వత్రా ప్రాధాన్యత సంతరించుకోనున్నాయి.

# కేసీఆర్ మాకు వారసత్వంగా ఇచ్చింది అప్పులు, తప్పులు - సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

విద్యాశాఖను ప్రక్షాళన చేశాం

ఎంతో కాలంగా పెండింగ్ లో ఉన్న టీచర్ల బదిలీలు, పదోన్నతుల సమస్యను పరిష్కరించి విద్యాశాఖను ప్రక్షాళన చేశామన్నారు. విద్యా ప్రమాణాలు తగ్గిపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ఇది తెలంగాణ రాష్ట్రానికి అవమానకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే విద్య ప్రమాణాలు పెంచేందుకు మీరంతా ఒక భావోద్వేగంతో విధులు నిర్వర్తించాలని అభ్యర్థులకు పిలుపునిచ్చారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందన్నారు. ఎక్కడ లోపం ఉందో ఒక్కసారి ఆలోచన చేయాలని సూచించారు. విద్యార్థులపై ప్రభుత్వం పెట్టేది ఖర్చు కాదు.. అది వారి భవిష్యత్ కు పెట్టుబడి అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గుతుందో మూలాలను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో విద్యాప్రమాణాలు పెంచేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ను నిర్మించబోతున్నామన్నారు. ఇటీవలే 55 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కోసం రూ.11,000 కోట్లు కేటాయించామన్నారు. విద్యార్థి, నిరుద్యోగుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చి దిద్దాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఒలంపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ అథారిటీని ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తోందన్నారు. క్రికెట్ లో రాణించిన సిరాజ్ కోసం నిబంధనలు సడలించి ఉద్యోగం ఇచ్చామన్నారు. బాక్సింగ్ లో రాణించిన నిఖత్ జరీన్ కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామన్నారు. పారాలింపిక్స్ లో రాణించిన దీప్తి జీవాంజీకి ఇంటి స్థలంతో పాటు ఉద్యోగం ఇచ్చామన్నారు.

కొంతమంది స్ట్రేచర్.. స్ట్రేచర్.. అని మాట్లాడుతున్నారన్నారు. స్ట్రేచర్ ఉందని విర్రవీగినవారు స్ట్రెచ్చర్ మీదకు వెళ్లారన్నారు. స్ట్రేచర్ అనేది స్థానానికి తప్ప వ్యక్తులకు ఉండదన్నారు. కేసీఆర్ తమకు వారసత్వంగా ఇచ్చింది అప్పులు, తప్పులు మాత్రమేనన్నారు. ప్రతీ నెలా రూ. 6500 కోట్లు కేసీఆర్ చేసిన అప్పులు తప్పులకే సరిపోతుందన్నారు. రాష్ట్రానికి కెసిఆర్ ఆర్థికంగా క్యాన్సర్ ఇచ్చారన్నారు. క్యాన్సర్ ముదురుతుంటే రాష్ట్రం దివాళా తీసిందంటారా? అని అంటున్నారన్నారు. వాస్తవాన్ని ఎన్నాళ్ళు దాచిపెడతారు? అని ప్రశ్నించారు. తాను వాస్తవాలు చెబుతుంటే%ా% దిగిపో దిగిపో అని మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. కేసీఆర్ కుటుంబం మొత్తం ఫ్యామిలీ ప్యాకేజ్ లా అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. అబద్ధాల ప్రాతిపదికన తాను రాష్ట్రాన్ని నడపనన్నారు. వాస్తవాలు పంచుకుని రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

# కాంగ్రెస్ కార్యకర్త ప్రసంగం మాదిరిగా గవర్నర్ ప్రసంగం -కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

తేదీ, సమయం, ఊరు.. చెబితే చర్చకు వస్తానని కేటీఆర్ ఓపెన్ ఛాలెంజ్ చేశారు. గవర్నర్ ప్రసంగం ద్వారా కాంగ్రెస్ సర్కార్ నీచత్వాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. బీసీల తరపున మాట్లాడిన సొంత ఎమ్మెల్సీని కాంగ్రెస్ సస్పెండ్ చేసిందన్నారు. కులగణనతో బీసీలను కాంగ్రెస్ మోసం చేసిందని మండిపడ్డారు. సచివాలయంలో పెట్టిన కాంగ్రెస్ తల్లిని, రాహుల్ గాంధీ తండ్రి విగ్రహాలను ప్యాక్ చేసి గాంధీ భవన్‌కు పంపుతామని చెప్పారు. కేసీఆర్‌పై కోపంతో రైతులను రేవంత్ రెడ్డి ఇబ్బంది పెడుతున్నారని ఫైర్ అయ్యారు. రేవంత్ రెడ్డి చేతకానితనంతో.. పంటలు ఎండిపోతున్నాయని కేటీఆర్ అన్నారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రాధాన్యతలు వేరేగా ఉన్నాయని తెలిపారు. రేవంత్ రెడ్డికి 20శాతం కమీషన్లు ఇవ్వకుంటే బిల్లులు పాస్ అవ్వవని ఆరోపించారు. బిల్లుల కోసం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఛాంబర్ ముందు బైఠాయించటం దేశంలో ఎక్కడా లేదని అన్నారు. 30శాతం కమీషన్ ఇస్తేనే మంత్రులు పనిచేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారని అన్నారు. పదవిని కాపాడుకోవటానికి ఢిల్లీకి మూటలు పంపే పనిలో రేవంత్ బిజీగా ఉన్నారని విమర్శించారు. దావోస్ పర్యటనలో వచ్చిన పెట్టుబడులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తన సోదరుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు.

# మా సిఫార్సు లేఖలను టీటీడీ పట్టించుకోవట్లేదు -మంత్రి కొండా సురేఖ

మొదటి పేజీ తరువాయి

ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలని కోరారు. తిరుమల, తిరుపతి దేవస్థానంలో వెంకటేశ్వర స్వామివారి దర్శనం కోసం సిఫార్సు లేఖల వ్యవస్థను తిరిగి తీసుకొచ్చినందుకు ఏపీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయంపై తెలంగాణ ప్రజాప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారని, వారి తరఫున ఆమె ధన్యవాదాలు తెలిపారు. కానీ, తెలంగాణ ప్రజాప్రతినిధులు ఇచ్చిన సిఫార్సు లేఖలను టీటీడీ పట్టించుకోకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో తెలంగాణ భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, వారి మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. టీటీడీ అధికారులు సీఎం ఆదేశాలను ఆచరణలో పెట్టడం లేదన్నారు. భక్తులు ఇక్కడి నుంచి లేఖలు తీసుకెళ్తున్నారని, అక్కడి అనుమతించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో ఏపీ సీఎం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

# అసెంబ్లీ సెక్రటరీపై మంత్రి పొన్నం ప్రభాకర్ సీరియస్

మొదటి పేజీ తరువాయి

అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. సంక్షేమం, సామాజిక న్యాయానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అభివృద్ధి, ప్రగతి వైపు అడుగులు పడుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. రైతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రైతులకు రూ.25వేల కోట్ల రుణమాఫీ చేశామని తెలిపారు.వరి రైతులకు పంట బోనస్ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఇది తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. అయితే గవర్నర్ ప్రసంగంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రసంగంలో అన్ని అబద్ధాలు ఉన్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యుల నిరసనల మధ్యే గవర్నర్ తన ప్రసంగాన్ని ముగించారు. అనంతరం అసెంబ్లీ రేపటికి వాయిదా పడింది.

# కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం

తెలంగాణ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు గవర్నర్ ప్రసంగంపై తీవ్రమైన విమర్శలు చేసారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ, గవర్నర్ ప్రసంగం కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా ఉందని చెప్పారు. గత 15 నెలల అప్రతిష్ట పరిపాలనపై ప్రాయశ్చిత్తం చేయాల్సిన సందర్భంలో గవర్నర్ ప్రసంగం అసత్యాలు ప్రసారం చేసినట్లు అభిప్రాయపడ్డారు.

రైతు సమస్యలపై నిర్లక్ష్యం

రాష్ట్రంలోని రైతులు తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్న సమయంలో, గవర్నర్ వారు రైతుల పట్ల కనీసం ఒక్క మాట కూడా పలకలేదని కేటీఆర్ అన్నారు. పంటలు ఎండిపోతున్న పరిస్థితి, 480 మంది రైతుల ఆత్మహత్యలు, రుణమాఫీ కల్పించకపోవడం వంటి సమస్యలపై గవర్నర్ స్పందించకపోవడం తీవ్ర దురదృష్టకరం అని ఆయన ఎత్తిపారేశారు.

కమీషన్ ఆరోపణలు

కేటీఆర్ రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై 20% కమీషన్ వ్యవహారాన్ని, అవినీతిని మండిపడుతూ, ఈ ప్రభుత్వాన్ని "విజన్ లేని" అన్నారు. సచివాలయంలో కాంట్రాక్టర్ల ధర్నాలు, చిన్న కాంట్రాక్టర్ల వేధింపులు, పథకాల అమలులో విఫలం కావడం వంటి సమస్యలపై గవర్నర్ ప్రసంగంలో ఎలాంటి ప్రస్తావన లేకపోవడం పై ఆయన నిరసన వ్యక్తం చేశారు.

గవర్నర్ కే అవమానం

గవర్నర్ స్థాయిని దిగజార్చినట్లు కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు, సాగునీటి సంక్షోభం, రుణమాఫీ వంటి కీలక అంశాలపై అసత్యాలు మాట్లాడడం గవర్నర్‌కి అవమానకరమని ఆయన పేర్కొన్నారు.

రైతులకు మరింత సహాయం అవసరం

రైతుల పరిస్థితిపై ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం, వారి పట్ల నిర్లక్ష్యం చూపడం సరికాదు అని కేటీఆర్ అన్నారు. పంటలు ఎండిపోతున్నా, రైతుల కోసం ఆందోళన జరపలేని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గవర్నర్ ప్రసంగం ద్వారా తమ వైఫల్యాలను దాచిపెట్టారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శ

కేటీఆర్ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని 1.62 లక్షల కోట్ల అప్పుతో అసమర్థంగా, అవినీతిరహితంగా నడిపించలేకపోయింది అని అన్నారు. పథకాలు అమలు చేయకుండా, కమీషన్లు, భూ డీల్స్ వంటి అక్రమాలపై స్వయంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆరోపణలు చేస్తుండటాన్ని ఆయన ఉదాహరించారు.

# ప్రాణం పోయినా కేసీఆర్‌తోనే ఉంటా

## : ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

నా ప్రాణం పోయినా కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని వీడే ప్రసక్తే లేదు. కొన్ని యూట్యూబ్ ఛానల్స్ తప్పుడు ప్రచారాలు చేస్తూ.. తాను పార్టీ మారుతున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నాయని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నా కుటుంబం, కేసీఆర్ నా నాయకుడు. ఎప్పటికీ అదే పార్టీ, అదే నాయకుడి వెంట ఉంటానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ కి నాకు ఉన్న అనుబంధాన్ని ఎవరూ తెంచలేరన్నారు.

కొంతమంది నా ప్రజాదరణను చూసి ఓర్వలేక కాంగ్రెస్ పార్టీకి ఉన్న చేతగాని పరిస్థితిని కప్పిపుచ్చుకోవడానికి ఇలాంటి నీచమైన ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. కానీ నా రాజకీయం, నా నమ్మకం, నా జీవితం అంతా బీఆర్ఎస్ పార్టీకి అంకితం. అధికారంలో ఉన్నా, లేకపోయినా నేను కేసీఆర్‌తోనే ఉంటానని మరోమారు స్పష్టం చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న యూట్యూబ్ ఛానల్స్ పై పరువు నష్టం దావా వేయబోతున్నట్లు పేర్కొన్నారు. అలాగే చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటానని హెచ్చరించారు. బీఆర్ఎస్ కుటుంబ సభ్యులెవ్వరూ ఇలాంటి అబద్ధాలను నమ్మొద్దు. వీటిని ధీటుగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

# ప్రశ్నించడం ఏమైనా రాజద్రోహమా?.. సీఎం రేవంత్ రెడ్డిని నిలదీసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలోని కొంతమంది అధికారులు నియంతృత్వ పాలకుల ఆదేశాలను గుడ్డిగా అనుసరిస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. వారు భవిష్యత్తులో అనివార్యమైన, పశ్చాత్తాపానికి గురికావాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. ఇలాంటి రాజ్యాంగ విరుద్ధమైన ఆదేశాలను గుడ్డిగా పాటించే ముందు.. అది నైతికమైనదా? కాదా? చట్టబద్ధత ఉందా? లేదా అనేదానిపై ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని సూచించారు. ఆ ఆదేశాలపై మీకు ఏమైనా సందేహాలు ఉంటే తటస్థ చట్టపరమైన అభిప్రాయాలను తీసుకోవాలన్నారు.

మీరు తీసుకునే ప్రతి అనైతిక, అక్రమ చర్యలు బాధితుల మనసులో చెరిగిపోని గాయాలను మిగుల్చుతుందని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మీరు తీసుకునే అనైతిక, అక్రమ చర్యలకు ప్రజాకోర్టులో తప్పనిసరిగా జవాబు చెప్పాల్సి వస్తుందని తెలిపారు. రిటైర్ అయిన తర్వాత కూడా ఆ సత్య మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటుందని అన్నారు. అలాంటి సమయంలో ఏ పాలకులు కూడా మిమ్మల్ని రక్షించలేరని హెచ్చరించారు. తర్వాత బాధపడే బదులు ఇప్పటి నుంచి జాగ్రత్తగా, నైతికంగా ఉండాలని సూచించారు. మీ భవిష్యత్తును, మీ పిల్లల భవిష్యత్తును జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు.

# రాజకీయ పార్టీలకు భట్టి,జనారెడ్డి బహిరంగ లేఖ



రాజకీయ పార్టీలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ నేత జానారెడ్డి బహిరంగ లేఖ రాశారు. నియోజకవర్గాల పునర్విభజనపై త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని.. ప్రతి పార్టీని ఆహ్వానిస్తామని తెలిపారు.

జనాభా ప్రాతిపదికన జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనతో రాష్ట్రానికి ప్రమాదం పొంచి ఉందని.. జరగబోయే నష్టం గురించి అన్ని పార్టీలను ఆహ్వానించి చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశానికి అన్ని పార్టీలు హాజరుకావాలని భట్టి విక్రమార్క, జానారెడ్డిలు సంయుక్తంగా బహిరంగ లేఖ విడుదల చేశారు. ప్రతి పార్టీని ప్రత్యేకంగా ఆహ్వానిస్తామని.. త్వరలోనే తేదీ, వేదిక ప్రకటిస్తామని బహిరంగ లేఖ ద్వారా వారు స్పష్టం చేశారు

# తెలంగాణ హైకోర్టులో కేటీఆర్‌కు ఊరట



తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు హైకోర్టు ఊరట దక్కింది. ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో దాఖలైన కేసును హైకోర్టు కొట్టివేసింది.

అసెంబ్లీ ఎన్నికల ప్రచార ర్యాలీలో భాగంగా బాణసంచా కాల్చి ప్రజలకు ఇబ్బంది కలిగించారంటూ ఫిర్యాదులందాయి. ఆ ఫిర్యాదులపై

కేటీఆర్,ముఠా గోపాల్‌పై ముషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని హైకోర్టులో బీఆర్ఎస్ నేతలు పిటిషన్లు దాఖలు చేశారు. వాదనలు విన్న జస్టిస్ కె.లక్ష్మణ్ కేసును కొట్టివేశారు.

క్రాంతి
ఆంధ్రప్రదేశ్
epaper.krtvnews.com

## ఘనంగా 54వ జాతీయ భద్రత వారోత్సవాలు

**-జండాను ఆవిష్కరించి వారోత్సవాలు ప్రారంభించిన కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్**

**-యాజమాన్యాల చేతిలో కార్మికుల ప్రాణాలు**

**విజయవాడ ,మార్చి 12 ( క్రాంతి న్యూస్ ):**




ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో బుధవారం 54వ జాతీయ భద్రత వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే కమ్యూనిటీ హాల్ లో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యంగా 54 వ జాతీయ భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని కార్మికులతో పాటు సామాన్య ప్రజానీకంలో కూడా భద్రత పట్ల అవగాహన కల్పించే మహత్తరమైన బాధ్యతను తమపై వేసుకుని ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి ముందుకొచ్చిన కొండపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ వారికి, అన్ని విధాల వారికి సహకరించిన మా డిపార్ట్మెంట్ అధికారులకు మంత్రి ధన్యవాదాలు తెలియజేసారు. మరీ ముఖ్యంగా జాతీయ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని నా కార్మిక లోక కుటుంబ సభ్యులందరినీ ఇలా కలవడం నాకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఏ రోజైతే నేను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాను ఆ రోజు నుండే ఈ రాష్ట్రంలో ఉన్న కార్మికులంతా నా కుటుంబ సభ్యుల కింద భావిస్తున్నాను. నా కుటుంబ సభ్యుల భద్రత నా బాధ్యతగా భావిస్తున్నాను. అందుకే అందరికీ భద్రత పైన అవగాహన కల్పించే ఉద్దేశంతోనే ఈ భద్రతా వారోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని నిర్ణయించమన్నారు.

అయితే ఈ వారోత్సవాలలో భాగంగా కేవలం కార్మికులకే కాకుండా సామాన్య ప్రజానీకానికి, విద్యార్థులందరికీ కూడా భద్రత పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. పోటీల్లో గెలుపొందిన వారందరికీ మంత్రి అభినందనలు తెలిపారు. 54వ జాతీయ భద్రత వారోత్సవాలు సేఫ్టీ అండ్ వెల్ బీయింగ్ కృషియల్ ఫర్ వికసిత్ భారత్ 2047 అనే నినాదం తో ప్రారంభించడం జరిగిందన్నారు. అంటే కార్మికులు భద్రంగా ఉంటేనే రాష్ట్రం భద్రంగా ఉంటుంది. కార్మికుల భద్రతతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ కల సాకారం అవుతుంది అనే స్పష్టమైన సందేశం ఇందులో ఇమిడి ఉందన్నారు.ఈ కలను నిజం చేసే బాధ్యత యాజమాన్యాల పైన కార్మికుల పైన అధికారులందరి పైన ఉందన్నారు.అయితే యాజమాన్యాలు మరింత బాధ్యత తీసుకోవాలనీ, ఎందుకంటే ఎప్పుడైతే కార్మికుడు మీ పరిశ్రమలో అడిగి పెట్టాడో అప్పుడే అతడు ప్రాణం మీ చేతిలో ఉన్నట్టేనని చెప్పారు.అందుకే రోజు తప్పకుండా భద్రతా ప్రతిజ్ఞ ను పాటించి దానిపైన అవగాహన కలిగించాలన్నారు. అలాగే భద్రత నియమాలని చాలా సరళమైన భాషలో కార్మికులందరికీ అర్థమయ్యేలా స్థానిక భాషలలో రూపొందించాలన్నారు.

రసాయన పరిశ్రమల్లో పనిచేసే కార్మికులందరికీ రసాయనాల పట్ల,వాటి వలన జరిగే ప్రమాదాల పట్ల శిక్షణా తరగతులను నిర్వహించాలనీ,స్మోక్ అలారం,వంటి ప్రమాదాల్ని ముందుగానే పసిగట్టి నివారించేటట్లు టెక్నాలజీని వాడుకోవాలన్నారు.

అయితే ఇందులో కార్మికుల పాత్ర చాలా కీలకమన్నారు.అందులోకార్మికులందరూ తప్పనిసరిగా సేఫ్టీ కిడ్స్ వేసుకునే పని ప్రాంతాల్లో తిరగాలి. నాకు ఒక కార్మికుడు హెల్మెట్ పెట్టుకుంటే జుట్టు ఊడిపోతుంది అని చెప్పి పెట్టుకోవడం లేదని సమాధానం చెప్పాడన్నారు. జుట్టు కన్నా ప్రాణం గొప్పదని తెలుసుకోవాలన్నారు.

మీరు అశ్రద్ధగా ఉంటే మీతో పాటు చుట్టుపక్కల కార్మికుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందని తెలుసుకోవాలన్నారు.

మీరు క్షేమంగా తిరిగి రావాలని మీ కుటుంబం మీ కోసం వేయికళ్లతో ఎదురుచూస్తుందన్న విషయాన్ని మీరు ఎప్పుడూ గుర్తుంచుకోవాలనీ మంత్రి గుర్తు చేశారు.మొన్న ఒక పరిశ్రమంలోని ప్రమాదం జరిగినప్పుడు ప్రమాదం జరుగుతున్న ప్రాంతాన్ని మిగతా కార్మికులంతా సెల్ఫీ తీసుకోవడం నా దృష్టికి వచ్చిందనీ, ప్రాణాలతో చెలగాటం ఆడే ఇలాంటి సరదాలు చేయకూడదనీ కార్మికులకు హితవు పలికారు.ముఖ్యంగా మన ప్రభుత్వం ప్రభుత్వం కొన్ని కీలక బాధ్యతలు తీసుకుంటుందనీ దానిలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలు గురించి సలహాలు ఇవ్వడానికి వసుధ మిశ్రా నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ కమిటీ రిపోర్ట్ ఒక నెలలో కొలిక్కి వస్తుందనీ, వచ్చాక ఆ కమిటీ రిపోర్ట్ ఆధారంగా అన్ని భద్రతా చర్యలను తూచా తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ రకంగా యాజమాన్యాలు కార్మికులు ప్రభుత్వ యంత్రాంగము అందరూ కలిసి జీరో యాక్సిడెంట్స్ అనే నినాదంతోనే ముందుకు వెళ్లాల్సిందిగా మంత్రి కోరారు. కార్మిక లోకపు కల్యాణానికి శ్రామిక లోకపు సౌభాగ్యానికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉంటుందని తెలియజేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారందరికీ మంత్రి వాసంశెట్టి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్పీతోపాటు కొండపల్లి ఇండస్ట్రీస్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, అసోసియేట్ ప్రతినిధి రామచంద్రరావు, రామ్స్ ప్లాంట్ హెడ్ ఆశిష్ కుమార్, కెసిపి ప్లాంట్ హెడ్ మధుసూదన్ రావు, జాయింట్ చీఫ్ ఆఫ్ ఇన్స్పెక్టర్ మోహన్ రావు, ఉషశ్రీ, డి సి ఐ పి శివకుమార్ రెడ్డి అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా సమైక్యత వాక్

అంతకుముందు ఉదయం విజయవాడ బి ఆర్ టి ఎస్ రోడ్ లో విద్యార్థులు కార్మికులతో కలసి సమైక్యత నడక కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం మాక్ నిర్వహించి మంత్రికి వందనాలు తెలిపారు. ఉత్సాహంగా జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి సంతోషం వ్యక్తం చేస్తూ కార్మికులను విద్యార్థులను అభినందించారు అనంతరం వారితో కలిసి పలహారం కార్యక్రమంలో పాల్గొని వారితో మాట్లాడుతూ వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం రైల్వే కమిటీ హాల్లో జరిగిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు.



## గ్రానైట్ వ్యాపారుల సమస్యలను పరిష్కరిస్తాం

**- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



విజయవాడ,మార్చి 12(క్రాంతిన్యూస్ ):తాడిపత్రి నియోజకవర్గ ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి నేతృత్వంలోని గ్రానైట్ వ్యాపారుల బృందం నేడు సచివాలయంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కార్యాలయంలో కలిసి గ్రానైట్ పరిశ్రమల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలపై విన్నవించారు. విద్యుత్ ఛార్జీల తగ్గింపు, రాయల్టీ ఫీజు, సహా వివిధ రకాల పన్నులను తగ్గించాలని లేదంటే రాష్ట్రంలో ఈ రంగం మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని మంత్రికి విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను యం యస్ యం ఈ మంత్రి హోదాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేబినెట్ సహచరుల దృష్టికి తీసుకువెళ్ళి తమను ఆదుకోవాలని వారు కోరారు. వారి సమస్యలను సావధానంగా విన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గ్రానైట్ వ్యాపారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, ఈ విషయాన్ని క్యాబినెట్ దృష్టికి తీసుకెళ్ళి గ్రానైట్ వ్యాపారుల సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## చంద్రబాబుకు ఇదే తొలి హెచ్చరిక

**: వైఎస్ జగన్**



క్రాంతిన్యూస్/ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు చెల్లించాలంటూ వైసీపీ యువత పోరు పేరుతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో యువత పోరు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. అలాగే యువత పోరు పేరిట ప్రజాస్వామ్యయుతంగా చేపట్టిన నిరసనలపై పోలీసుల దౌర్జన్యాలను ఖండిస్తున్నట్లు జగన్ తెలిపారు. పలుచోట్ల పోలీసులతో ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని చూసినా.. విద్యార్థులు, పోలీసులు గట్టిగా గళమెత్తారని ప్రశంచించారు. చంద్రబాబుకు నిరుద్యోగులు, విద్యార్థులు పంపిన తొలి హెచ్చరిక అంటూ జగన్ పేర్కొన్నారు.

పేదరికం వలన విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే కారణంతో వైసీపీ ప్రభుత్వం విద్యాదీవెన ద్వారా సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను, వసతి దీవెన ద్వారా హాస్టల్, మెస్ ఛార్జీలను విద్యార్థుల తల్లులు,పిల్లల ఖాతాలకే జమచేసిందని జగన్ గుర్తుచేశారు. వైసీపీ అమలు చేసిన పథకాలను కూటమి ప్రభుత్వం పూర్తిగా నీరుగార్చిందని జగన్ విమర్శించారు. చంద్రబాబు గత పాలనలోని ఆ చీకటి రోజులనే మళ్లీ తీసుకువచ్చారని జగన్ ఆరోపించారు.

“2024 జనవరి – మార్చి త్రైమాసికానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బును ఏప్రిల్‌లో వెరిఫై చేసి, మేలో చెల్లించాల్సి ఉంది. అక్కడ నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ప్రతి త్రైమాసికానికి రూ.700 కోట్ల చొప్పున ఏడాదికి రూ.2,800 కోట్లు ఇవ్వాలి. వసతి దీవెన కింద హాస్టల్ ఖర్చులకు మరో రూ.1,100 కోట్లు ఇవ్వాలి. ప్రతి ఏడాదికి ఈ రెండు పథకాలకు రూ.3,900 కోట్లు ఖర్చు చేయాలి. కానీ చంద్రబాబుగారూ, మీరిచ్చింది కేవలం రూ. 700 కోట్లు. అదికూడా ఇప్పటికీ పూర్తిగా పిల్లలందరికీ చేరలేదు. అంటే గతేడాది పిల్లలకు బాకీ పెట్టిన రూ.3,200 కోట్లు, అదీ కాక ఈ ఏడాది ఖర్చుచేయాల్సిన మరో రూ. 3,900 కోట్లు, రెండూ కలిపితే రూ.7,100 కోట్లు ఈ సంవత్సరం ఖర్చుపెట్టాలి. అయితే ఈ బడ్జెట్‌లో ప్రవేశపెట్టింది కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే. “ అంటూ వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.మరోవైపు తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని.. అప్పటి వరకూ నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని టీడీపీ హామీ ఇచ్చిందని జగన్ పేర్కొన్నారు. ఉద్యోగాలు ఇవ్వడం లేదు కదా.. వైయస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను ఊడపీకుతున్నారని జగన్ ఆరోపించారు. నిరుద్యోగ భృతి ఇవ్వాలంటే ఏటా రూ.7,200 కోట్లు ఖర్చు చేయాలన్న జగన్.. ఏపీ ప్రభుత్వం బడ్జెట్లో ఒక్క పైసా కేటాయించలేదని మండిపడ్డారు. ఈ రెండేళ్లలోనే ప్రతి నిరుద్యోగికీ రూ.72 వేల చొప్పున బకాయి పడ్డారంటూ వైఎస్ జగన్ విమర్శించారు.


## జూన్ నాటికి 3 లక్షల గృహాలను ప్రారంభించేందుకు చర్యలు

**-పిఎంఎవై 1.0 పథకం గడువు మరో ఏడాది పాటు పొడిగింపు**

**-ఎస్సీ,ఎస్టీ,పివిటిజి,బిసీ గృహ లబ్దిదారులకు అదనపు సాయం**

**-గృహ నిర్మాణ లబ్దిదారులకు సకాలంలో మెటీరియల్ సరఫరాకు కృషి**

**రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి**



విజయవాడ , మార్చి 12 ( క్రాంతి న్యూస్ )రాష్ట్రంలో వచ్చే జూన్ నెలాఖరులోగా 3 లక్షల గృహాల నిర్మాణాలను పూర్తి చేసి ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖామాత్యులు కొలుసు పార్థసారధి వెల్లడించారు. ఈమేరకు బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ 2019-24 మధ్య కాలంలో రాష్ట్రానికి మొత్తం 18.04 లక్షల గృహాలు మంజూరైతే గత ప్రభుత్వం కేవలం 5.87 లక్షల గృహాలను మాత్రమే పూర్తి చేసి, 12.20 లక్షల గృహ నిర్మాణాలను అసంపూర్తిగా విడిచిపెట్టేసిందని పేర్కొన్నారు. అదే విధంగా 2014-19 మధ్య కాలంలో తమ ప్రభుత్వం ఎస్సీ గృహ నిర్మాణ లబ్దిదారులకు రూ.50,000, ఎస్టీలకు రూ.75,000 అదనపు ఆర్థిక సాయం అందించేదని, కానీ గత ప్రభుత్వం ఈ అదనపు సాయాన్ని రద్దు చేయడమే గాక యూనిట్ విలువను రూ.1.80 లక్షలకు తగ్గించేసిందన్నారు. ఈ మొత్తంలో కేవలం రూ.30,000 మాత్రమే గత ప్రభుత్వం అందజేయడం జరిగిందని తెలిపారు. గృహ నిర్మాణానికి కేటాయించిన నిధులను కూడా గత ప్రభుత్వం అస్తవ్యస్త విధానాలతో వేరే పథకాలకు మళ్లించడంతో రాష్ట్రంలో గృహ నిర్మాణ పథకాలు పూర్తిగా కుంటు పడ్డాయని మంత్రి పార్థసారధి స్పష్టం చేశారు.

అయితే గతంలో తమ పభుత్వం అందించిన అదనపు సాయాన్ని తిరిగి పునరుద్ధరిస్తూ ఈ నెల 10 వ తేదీన ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయడం జరిగిందన్నారు. ఈ ఉత్తర్వుల మేరకు ఎస్సీ, బీసీ లబ్దిదారులకు రూ.50 వేలు, ఎస్టీ లబ్దిదారులకు రూ.75 వేలు మరియు పివిటీజీలకు రూ.1.00 లక్షల అదనపు ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. పిఎమ్ఏవై (అర్బన్) బిఎల్సీ-1.0, పిఎమ్ఏవై (గ్రామీణ్) -1.0 మరియు పి.ఎం.జన్మన్ పథకాల క్రింద ఇప్పటికే గృహాలను మంజూరు చేయబడిన దాదాపు 5,98,710 లబ్దిదారులకు ఈ అదనపు ఆర్థిక సహాయం వర్తిస్తుందన్నారు. వీరిలో 1,57,383 మంది ఎస్సీలు, 45,766 మంది ఎస్టీలు, 3,73,204 మంది బీసీలు మరియు 22,357 లబ్దిదారులు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ విధంగా గృహ లబ్దిదారులకు అదనపు సాయం అందజేయడం వల్ల ప్రభుత్వంపై దాదాపు రూ.3,219.75 కోట్ల అదనపు భారం పడుతుందని, అయినప్పటికీ పేదవాళ్లకు సాయం చేయాలనే ఆలోచనతో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన వివరించారు.

ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తదుపరి 1.25 లక్షల గృహ నిర్మాణాలను పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన 7.25 లక్షల గృహ నిర్మాణాలను మార్చి 2026 లోగా పూర్తి చేసే లక్ష్యంతో ముందుకు వెళు తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశం మేరకు వీటిలో 5.00 లక్షల గృహాలను ఈ ఏడాది జూన్ లోపు పూర్తి చేయనున్నామని, మిగిలిన గృహాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయనున్నామన్నారు.

అదే విధంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0 పథకం అమలు గడువు ముగిసిపోవడంతో, ఆ గడువును పొడించాలని తమ ప్రభుత్వం చేసిన కృషి సఫలీకృతం అయిందని, వచ్చే ఏడాది మార్చి వరకూ కేంద్ర ప్రభుత్వం ఈ గడువును పొడిగించిందని ఆయన తెలిపారు. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుని, త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని లబ్దిదారులకు ఆయన సూచించారు.

## విజయవాడ లో భద్రతా తనిఖీని నిర్వహించిన రైల్వే జనరల్ మేనేజర్




విజయవాడ మార్చి 12 ( క్రాంతి న్యూస్ )దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ బుధవారం విజయవాడ డివిజన్‌లోనికాకినాడ-సామర్లకోట-రాజమండ్రి-నిడదవోలు-ఏలూరు సెక్షన్‌ను తనిఖీ చేశారు. ఈ తనిఖీ సమయంలో ఆయనతో పాటు విజయవాడ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర పాటిల్ మరియు ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు.జనరల్ మేనేజర్ కాకినాడ పోర్ట్ రన్నింగ్ రూమ్‌లో తనిఖీని ప్రారంభించారు. అక్కడ ఆయన లోకో సిబ్బందికి అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు మరియు సిబ్బంది సభ్యులతో సంభాషించారు. పచ్చని వాతావరణాన్ని ప్రోత్సహించడానికి ఆయన రన్నింగ్ రూమ్ వద్ద మొక్కలు నాటారు. ఇంకా, ఆయన సామర్లకోట రైల్వే స్టేషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి, అక్కడ ప్రయాణీకులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. స్టేషన్ మాస్టర్ కార్యాలయం మరియు సర్క్యులేటింగ్ ప్రాంతాన్ని కూడా ఆయన పరిశీలించారు.అరుణ్ కుమార్ జైన్ రాజమండ్రి రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లోని ప్రయాణీకుల సౌకర్యాలు మరియు సర్క్యులేటింగ్ ప్రాంతాన్ని ఆయన సమీక్షించారు. ఆయన సిబ్బందితో సంభాషించి, అధికారులతో మరిన్ని అభివృద్ధి ప్రణాళికలపై చర్చించారు. అంతేకాకుండా, గోదావరి రైల్వే వంతెనను క్షుణ్ణంగా పరిశీలించి, వంతెన మరియు రైలు పట్టాల భద్రతా అంశాలను సమీక్షించారు. జనరల్ మేనేజర్ నిడదవోలు రైల్వే స్టేషన్‌కు వెళ్లి, అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా స్టేషన్‌లో చేపట్టిన పునరాభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ తనిఖీ సమయంలో పలువురు ప్రజాప్రతినిధులు జనరల్ మేనేజర్‌ను కలుసుకుని తమ ప్రాంతానికి సంబంధించిన రైలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రాతినిధ్యాలను సమర్పించారు. తరువాత జనరల్ మేనేజర్ కి.మీ. నంబర్ 528/2 వద్ద ఉన్న లెవల్ క్రాసింగ్ గేట్ నంబర్ 368ను తనిఖీ చేసి అక్కడ భద్రతా అంశాలను సమీక్షించారు మరియు అధికారిక రికార్డులను పరిశీలించారు. ఇంకా, జనరల్ మేనేజర్ ఏలూరు రైల్వే స్టేషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్కడ అందుబాటులో ఉన్న ప్రయాణీకుల సౌకర్యాలను మరియు వసతులను సమీక్షించారు. స్టేషన్ మాస్టర్ కార్యాలయాన్ని కూడా తనిఖీ చేసి ఎంట్రీలను సమీక్షించారు



# జర్నలిస్టుల ఆరోగ్య పథకంపై త్వరలో సమావేశం

## -టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందానికి మంత్రి దామోదర్ హామీ

రాష్ట్రంలో జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పథకాన్ని పగడ్బందీగా అమలు చేసేందుకు గాను త్వరలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సి.దామోదర్ రాజ నరసింహ హామీ ఇచ్చారు.

బుధవారం నాడు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో ప్రతినిధి బృందం అసెంబ్లీలోని ఛాంబర్ లో మంత్రి దామోదర్ రాజ నర్సింహాను కలిసి జర్నలిస్టుల ఆరోగ్య పథకం అమలుపై చర్చించింది. అంతేకాకుండా వినతి పత్రాన్ని అందించింది. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా రాష్ట్రంలో జర్నలిస్టుల ఆరోగ్య పథకం అమలుకాక పోవడంతో జర్నలిస్టులు అనుభవిస్తున్న కష్టాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అసలే ఆర్థిక కష్టాలతో జీవితాలు కొనసాగిస్తున్న జర్నలిస్టులకు, వైద్య ఖర్చులు





మరింత భారంగా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి జర్నలిస్టులు వైద్యం పొందే పరిస్థితి నెలకొందని ఆయన అన్నారు. దీనిపై స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రత్యేక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్కురి రాములు, రాష్ట్ర కార్యదర్శి వరకాల యాదగిరి, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు రజనీకాంత్ తో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు ఉన్నారు.

# ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలంపియాడ్ పరీక్షలు

## ప్రతిభ కనబరిచిన సింగరేణి పాఠశాలల విద్యార్థులు

భద్రాద్రి కొత్తగూడెం ,12 మార్చి (క్రాంతిన్యూస్ ):సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషన్ సొసైటీ వారి ఆధ్వర్యంలో నడపబడుతున్న 9 సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలల్లో విద్యా సంవత్సరం 2024 -25 లో యూనిఫైడ్ కౌన్సిల్ వారిచె గత జనవరి నెల 30వ తారీఖున నిర్వహించిన ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలంపియాడ్ నందు అన్ని పాఠశాలల నుండి 533మంది విద్యార్థులు పాల్గొనడం జరిగింది. ఆ పరీక్షకు సంబంధించి ఫలితాలు తేదీ 10 మార్చి 2025 నాడు విడుదల చేశారు అందులో.



సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాల కొత్తగూడెం నుండి 114 విద్యార్థులు పాల్గొనగా వారిలో 20మంది గోల్డ్ మెడల్ సాధించారు మరియు ముగ్గురు విద్యార్థులు క్యాష్ అవార్డు 2000 రూపాయలు చొప్పున గెలుచుకున్నారు.

మణుగూరు పాఠశాల నుండి 84 మంది విద్యార్థులు పాల్గొనగా 13 మంది గోల్డ్ మెడల్ సాధించారు. ఇల్లందు పాఠశాల నుండి 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

భూపాలపల్లి పాఠశాల నుండి 52 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

గోదావరిఖని సెక్టర్ 3 పాఠశాల నుండి 70 మంది విద్యార్థులుపాల్గొన్నారు వారిలో 8 మంది గోల్డ్ మెడల్స్ సాధించారు. గోదావరిఖనిలోని సెక్టార్ 2పాఠశాల నుండి 34 మంది విద్యార్థులు పాల్గొన్నారు వారిలో 8 మంది గోల్డ్ మెడల్ సాధించారు. 3. సిసిసి నస్పూర్ పాఠశాల నుండి49 మంది విద్యార్థులు పాల్గొన్నారు వారిలో ఆరుగురు గోల్డ్ మెడల్ సాధించారు. మందమర్రి పాఠశాల నుండి 83 మంది విద్యార్థులు పాల్గొన్నారు అలాగే గొల్లేటి పాఠశాల నుండి 17 మంది విద్యార్థులు పాల్గొన్నారు ఒక విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించారు. ఈ ఒలంపియాడ్ కార్యక్రమాన్ని అన్ని సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలల చీఫ్ కోఆర్డినేటర్ గా డి .ఫూల్ సింగ్ సీనియర్ గణిత ఉపాధ్యాయుడు వ్యవహరించారు ఈ సందర్భంగా ఈ విద్యా సంవత్సరంలో రెండు ఒలంపియాడ్ నేషనల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ మరియు యూనిఫైడ్ ఇంటర్నేషనల్ మాథమెటిక్స్ ఒలింపియాడ్ పరీక్షలలో సుమారు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొని సమర్థవంతంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించిన అన్ని సింగరేణి పాఠశాలల ప్రధానోపాధ్యాయులను మరియు ఒలంపియాడ్ ఇన్ ఛార్జ్ ఉపాధ్యాయులను. సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ మరియు జాయింట్ సెక్రెటరీ కె సునీల్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు ఇది నిరంతరం ప్రతి పాఠశాలలో రాబోయే సంవత్సరాలలో కూడా కొనసాగుతుందని వివరించారు. దీనితోపాటు అన్ని పాఠశాలల విద్యార్థులలో మంచి క్రమశిక్షణతో కూడిన బోధన మరియు అన్ని రకాల ప్రతిభా పరీక్షలలో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు

# దేశంలోనే ఇంకుడు గుంతల నిర్మాణాల్లో జిల్లా అగ్రస్థానంలో ఉండాలి

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

భద్రాద్రి కొత్తగూడెం ,12 మార్చి (క్రాంతిన్యూస్ ): జల సంచయ్ జన్ భగీదారి క్యాచ్ ద రైన్ అమలులో భాగంగా దేశంలోనే జిల్లాను అగ్రస్థానంలో నిలపటమే లక్ష్యం అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం కొత్తగూడెం హమాలీ కాలనీలో జల సంచయ్ జన్ భగీ దారి అమలులో భాగంగా కలెక్టర్ స్వయంగా ఇంకుడు గుంతల నిర్మాణానికి ఎంత సమయం పడుతుంది, ఎలా నిర్మించాలి అని పరిశీలించారు. దీనిలో భాగంగా కలెక్టర్ స్వయంగా ఇంకుడు గుంత ను త్రవ్వారు. స్థానికంగా ఉన్న యువకులతో మమేకమై వారితో కలిసి ఇంకుడు గుంటల నిర్మాణాన్ని కలెక్టర్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన భూగర్భ జలాలను అభివృద్ధి పరచడానికి ఇంకుడు గుంతల ఆవశ్యకతను యువకులకు వివరించారు. 1ఠ1 ఇంకుడు గుంత తవ్వకానికి గంటన్నర సమయం మాత్రమే పట్టిందని, యువకులు గ్రామస్తులు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని, భవిష్యత్తు కాలంలో నీటి ఎద్దడి



లేకుండా ప్రతి నీటి బొట్టు వృధా కాకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఎంపీడీవో, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఐ హెచ్ ఆర్ సి ములుగు జిల్లా కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేత

## అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ జిల్లా అధ్యక్షులు భానోత్ వెంకన్న



ములుగు,12 మార్చి (క్రాంతిన్యూస్ ):ములుగు జిల్లా కేంద్రంలోని ఈరోజు అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ ములుగు జిల్లా కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందించిన అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ జిల్లా అధ్యక్షులు భానోత్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులుగా భూక్య సునీల్, జిల్లా కార్యదర్శులుగా, కుదురుపాక రాజేష్, బానోత్ జవహర్ లాల్, జిల్లా ఉపాధ్యక్షులుగా, జానుపట్ల జయరాజ్, కంచర్ల రాజు, కన్వీనర్ గా తిప్పనపల్లి రాజు, కో కన్వీనర్, రుద్ర బోయిన మల్లేష్ గౌడ్, ఆర్గనైజర్ సెక్రెటరీగా, కనకం సంజీవ, జిల్లా లీగల్ టీం అడ్వైజర్, అడ్వకేట్, కన్నోజు సునీల్ కుమార్, లను నియమించినట్టు అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ ములుగు జిల్లా అధ్యక్షుడు భానోత్ వెంకన్న ప్రకటనలో తెలిపారు, మానవహక్కుల పరిరక్షణ కోసం బాధితుల పక్షాన నిలబడి పోరాటం చేసి వారికి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని నూతనంగా ఎన్నిక కాబడ్డ జిల్లా కమిటీ సభ్యులకు తెలిపారు.

# చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీస్ పోస్ట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పోస్ట్ ల ను కాంటాక్ట్ పద్ధతిలో భర్తీ చేయవద్దు

## కొత్తగూడెం ఏరియా జి ఎం కి మెమోరాండంను ఇచ్చిన సీఎంఓఏఐ కొత్తగూడెం ఏరియా కమిటీ సభ్యులు



భద్రాద్రి కొత్తగూడెం ,12 మార్చి (క్రాంతిన్యూస్ ): కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో బుధవారం జీఎం ఎం. షాలేం రాజు ని కలిసి కొత్తగూడెం ఏరియా అధికారుల సంఘ సభ్యులు అందరూ నూతనంగా రిలీజ్ చేసిన కాంట్రాక్ట్ పద్ధతిలో చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీస్ పోస్ట్ మరియు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పోస్ట్ నియామకలను వ్యతిరేకిస్తూ కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయొద్దని వాటికి సంబంధించిన అధికారులతో భర్తీ చేయాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కి మెమోరండం సమర్పించడం జరిగింది.

ఈ సందర్భంగా జీఎం స్పందిస్తూ ఈ మెమోరాండంను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలియజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా సీఎంఓఏఐ వైస్ ప్రెసిడెంట్ అజ్మీర శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ ఏ ఉపేంద్ర బాబు, ట్రెజరర్ వై వి రావు, మరియు అధికారులు బి.రవీందర్, ఎం.వెంకటేశ్వర్లు, బి.శివ కేశవరావు, వి.వి. మధుకర్, వి. శ్రీనివాస్ రావు, వి.ఎన్. శ్యాం ప్రసాద్, బి.మాధవ్, మజ్జి.మురళి, జి.సంఘమిత్ర, రమేష్ మరియు కొత్తగూడెం ఏరియా సీఎంఓఏఐ సభ్యులు పాల్గొన్నారు.

# హనుమకొండ ట్రాఫిక్ సిఐ సీతా రెడ్డి ట్రాఫిక్ ప్రాబ్లం లేకుండా నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్న సీతా రెడ్డి

హనుమకొండ,12 మార్చి (క్రాంతిన్యూస్ ): ఈ రోజు హనుమకొండ జిల్లా హనుమాన్ నగర్ లో ట్రాఫిక్ నియంత్రణ కార్యక్రమంలో సీఐ హనుమకొండ ట్రాఫిక్ సితారెడ్డి రోడ్ల పై చిరు వ్యాపారులను ఆటో డ్రైవర్లను మరియు కిరాణం పాన్ షాప్ అందరితో మాట్లాడి షాపుల ముందు టూ వీలర్ త్రీ వీలర్ నిల్పకూడదని పబ్లిక్ కు ఇలాంటి ప్రాబ్లం లేకుండా చూడాలని అందరితో మాట్లాడి అందరూ సహకరించాలని సిఐ సీతారెడ్డి అందరితో మాట్లాడడం జరిగింది ఆటో యూనియన్ కిరాణం పాన్ షాప్ చిరు వ్యాపారులు అందరు సహకరిస్తామని చెప్పడంతో మీకు ఎలాంటి సహాయం కావాలన్న చేస్తానని చెప్పిన సీఐ హనుమాన్ నగర్ జంక్షన్ లో ట్రాఫిక్ సిగ్నల్ పెట్టించడం చాలా సంతోషకరమైన విషయం రోడ్డు వెడల్పు కార్యక్రమంలో కూడా సహకరిస్తానని మీరు కూడా సహకరించాలని తెలిపిన సిఐ హనుమాన్ నగర్ జంక్షన్ లో ఐమాక్స్ లైట్ పెద్ద లైటు ఉండాలని రాత్రిపూట చాలా ఇబ్బందిగా ఉంది కాబట్టి మున్సిపాలిటీ మరియు ప్రభుత్వానికి సహకరించాలని అక్కడి ప్రజలు సిఐ కి విన్నపించుకున్నారు ప్రతిచోట ట్రాఫిక్ సిగ్నల్





ట్రాఫిక్ నియంత్రణ కార్యక్రమంలో డిపార్ట్మెంట్ సహాయంతో ఎస్సై కానిస్టేబుల్స్ సహాయంతో సిఐ సీతా రెడ్డి హనుమకొండ పరిధిలో ఉన్న ప్రతి చోట ప్రజలకు ఎలాంటి ప్రాబ్లం లేకుండా ట్రాఫిక్ ప్రాబ్లం లేకుండా చూస్తున్నారు కాబట్టి హనుమకొండ ట్రాఫిక్ సిఐ గా రావడం అదృష్టంగా భావిస్తున్న ప్రజలు ఈరోజు హనుమాన్ నగర్ జంక్షన్ లో సిఐ సీతా రెడ్డి తో రాష్ట్ర ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ సభ్యులు లావుడియా రాజు నాయక్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిర్ర రమేష్ సమ్మయ్య యాకూబ్ మోహన్ తిరుపతి ఆటో యూనియన్ లీడర్స్ మొదలైన వారు పాల్గొని సీఐ సీత రెడ్డి విన్నపించడం జరిగింది అందరికీ సహకరిస్తానని చెప్పిన హనుమకొండ ట్రాఫిక్ సిఐ సీతా రెడ్డి

## ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా..?

# అయితే మీకు జింక్ లోపం ఉన్నట్లే..

హెల్త్ న్యూస్ ,12 మార్చి (క్రాంతిన్యూస్ ): మన శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే అందుకు అనేక రకాల పోషకాలు అవసరమని అందరికీ తెలిసిందే. పోషకాల విషయానికి వస్తే వాటిల్లో విటమిన్లు, మినరల్స్ చాలా ముఖ్యమైనవి. మినరల్స్ మన శరీరంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. వాటిల్లో జింక్ అనేక జీవక్రియలను నిర్వహిస్తుంది. రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా ఉండేందుకు జింక్ అవసరం అవుతుంది. అలాగే గాయాలు త్వరగా మానడానికి, మెదడు పనితీరుకు, చర్మం, శిరోజాలు ఆరోగ్యంగా ఉండేందుకు, కంటి చూపు కోసం కూడా జింక్ ఉపయోగపడుతుంది. అయితే మన శరీరంలో జింక్ లోపం ఉంటే పలు లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలను బట్టి జింక్ లోపం ఏర్పడిందని తెలుసుకుని జింక్ ఉండే ఆహారాలను తింటుంటే ఈ లోపం నుంచి బయట పడవచ్చు. అలాగే అనేక వ్యాధుల నుంచి బయట పడవచ్చు. జింక్ లోపం ఉంటే మన శరీరం మనకు ఎలాంటి సంకేతాలను ఇస్తుందంటే..

రోగ నిరోధక వ్యవస్థ..

మన శరీర రోగ నిరోధక వ్యవస్థ మెరుగ్గా పనిచేసేందుకు జింక్ అవసరం అవుతుంది. అయితే జింక్ లోపిస్తే రోగ నిరోధక వ్యవస్థ పనితీరు సరిగ్గా ఉండదు. దీంతో తరచూ ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. లేదా వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు వచ్చినా ఒక పట్టాన తగ్గవు. చాలా కాలం పాటు రోగాలు అలాగే ఉంటాయి. ముఖ్యంగా తరచూ దగ్గు, జలుబు వంటి సమస్యలు వస్తుంటాయి. అలాగే రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. గాయాలు త్వరగా మానవు. పుండ్లు పడతాయి. ఈ లక్షణాలు కనిపిస్తుంటే జింక్ లోపం ఉందని అర్థం చేసుకోవాలి. అలాగే జింక్ లోపం వల్ల ఆకలి కూడా ఉండదు. మీకు అసలు ఆకలి సరిగ్గా లేకపోయినా కూడా జింక్ లోపంగానే భావించాలి. జింక్ లోపం వల్ల మన నాలుక రుచి చూసే శక్తిని, ముక్కు వాసన చూసే శక్తిని కోల్పోతాయి. దీంతో ఆహారం రుచిగా ఉండదు. అలాగే ఆకలిగా కూడా అనిపించదు.

**చర్మం, శిరోజాలు..**

జింక్ లోపం ఉంటే జుట్టు పలుచబడి చిట్లిపోతుంది. జుట్టు కుదుళ్లు, జుట్టు ఆరోగ్యంగా ఉండాలంటే జింక్ అవసరం అవుతుంది. జింక్ లోపిస్తే జుట్టు సమస్యలు ఎక్కువవుతాయి. జుట్టు బాగా రాలిపోతుంది. అలాగే తలలో ఇన్‌ఫెక్షన్లు వస్తాయి. చుండ్రు ఏర్పడుతుంది. రాలుతున్న జుట్టు మళ్లీ రాదు. ఈ లక్షణాలన్ని జింక్ లోపాన్ని సూచిస్తాయి. అలాగే జింక్ లోపం వల్ల చర్మ సమస్యలు సైతం వస్తుంటాయి. ముఖ్యంగా చర్మంపై దురదలు ఏర్పడుతాయి. దద్దుర్లు వస్తుంటాయి. ముఖంపై మొటిమలు కూడా వస్తాయి. ఇతర చర్మ వ్యాధులు కూడా వస్తుంటాయి. ఇవన్నీ జింక్ లోపాన్ని సూచిస్తాయి.




జీర్ణ వ్యవస్థ..

మన జీర్ణ వ్యవస్థ పనితీరుకు జింక్ అవసరమే. అలాగే మెటబాలిజంను క్రమబద్ధీకరించేందుకు కూడా జింక్ ఉపయోగపడుతుంది. జింక్ లోపం వల్ల జీర్ణ సమస్యలు వస్తాయి. ముఖ్యంగా తరచూ విరేచనాల బారిన పడుతుంటారు. కొందరికి మలబద్ధకం కూడా ఉంటుంది. తిన్న ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకోలేదు. మెదడు పనితీరుకు కూడా జింక్ పనిచేస్తుంది. జింక్ లోపిస్తే జ్ఞాపకశక్తి తగ్గుతుంది. దేనిపై కూడా దృష్టి పెట్టలేరు. ఏకాగ్రత తగ్గిపోతుంది. మానసికంగా అనారోగ్యంగా ఉన్నట్లు డల్‌గా ఫీలవుతారు. ఈ లక్షణాలన్నీ జింక్ లోపం వల్ల కనిపించేవే. ఈ లక్షణాలు ఎవరిలో అయినా ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. జింక్ లోపిస్తే డాక్టర్లు ఇచ్చే మందులను వాడాలి. అలాగే జింక్ ఉండే ఆహారాలను తింటుంటే ఈ సమస్యల నుంచి బయట పడవచ్చు.

## చిన్నవయసులోనే కీళ్లవాతం

# ఎందుకు వస్తుంది?

హెల్త్ న్యూస్ ,12 మార్చి (క్రాంతిన్యూస్ ):వయసు పెరిగే కొద్దీ వచ్చే కీళ్లవాతం.. ఈ మధ్య కాలంలో చిన్న వయసులోనూ సాధారణంగా మారిపోయింది. ముఖ్యంగా 20-27 వయసు మధ్యగలవారిలో అర్థరైటిస్ వ్యాధి వేధిస్తోంది. ఫలితంగా వాపుతో పాటు తీవ్రమైన నొప్పితో కనీసం నడవలేక ఇబ్బంది పడుతున్నారు. అందుకే ఈ వ్యాధి రాకముందే జాగ్రత్త పడాలని.. ఇంకా తొలి దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అర్థరైటిస్ వచ్చేందుకు కారణాలు ఏంటి? ఇందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.



ఊబకాయం : అధిక బరువు వల్ల కీళ్లు, మోకాళ్లు, తుంటిపై తీవ్ర ఒత్తిడి పడుతుందని నిపుణులు చెబుతున్నారు. దీర్ఘకాలం పాటు ఇలానే కొనసాగడం వల్ల కాళ్లలో గుజ్జు తగ్గిపోతుందని.. ఫలితంగా కీళ్లవాతం వస్తుందని అంటున్నారు.

జన్యువులు : జన్యువులు సైతం కీళ్లవాతం రావడంలో కీలక పాత్ర పోషిస్తాయని అంటున్నారు. ఇంకా కుటుంబంలో ఇలాంటి సమస్యలు ఉంటే వీటి ముప్పు ఎక్కువగా ఉంటుదని తెలిపారు. అందుకే కుటుంబంలో ఎవరికైనా ఈ వ్యాధి ఉంటే ముందే జాగ్రత్తపడి.. తొలిదశలోనే చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు.

గాయాలు : గతంలో తగిలిన గాయాలు సైతం కీళ్లవాతానికి కారణం అవుతాయని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా ఎముకలు విరగడం, పగుళ్లు వచ్చిన వారిలో ఈ అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఇదే కాకుండా స్వల్ప గాయాల వల్ల కలిగే వాపు, నొప్పితో కూడా ఇది వస్తుందని చెబుతున్నారు.

జీవనశైలి మార్పులు : ఒకే చోట ఎక్కువ సేపు కదలకుండా కూర్చునే వారిలో అనేక సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలా శారీరక వ్యాయామం లేకపోవడం వల్ల కండరాలు, ఎముకలు బలహీన పడి వాపు, దీర్ఘకాలం నొప్పి ఉంటుందని చెబుతున్నారు. దీంతో ఆర్థరైటిస్ వస్తుందని వివరిస్తున్నారు.

ఆహార మార్పులు : రోజూవారీ ఆహారంలో సరైన పోషకాలు లేకపోవడం వల్ల కూడా కీళ్ల నొప్పులు వచ్చే ప్రమాదం ఉందని అంటున్నారు. పోషకాహారం లేక వాపు, నొప్పి వస్తుందని చెబుతున్నారు. ప్రాసెస్ చేసిన ఆహారం, ఎక్కువ చక్కెర తీసుకోవడం వల్ల యువతలోనూ కీళ్లవాతం సమస్య వస్తుందని హెచ్చరిస్తున్నారు.

గౌట్ : శరీరంలో యూరిక్ యాసిడ్ పేరుకుపోవడం వల్ల గౌట్ సమస్య తలెత్తుందని చెబుతున్నారు. ఇది వయసు పెరిగిన వారిలో సాధారణంగానే కనిపించినా.. ఈ మధ్య యువతలోనూ వస్తుందని ఫలితంగా అర్థరైటిస్ వచ్చే ప్రమాదం ఉందన్నారు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

బరువును అదుపులో ఉంచుకోవాలి

తక్కువ శ్రమతో కూడిన శారీరక వ్యాయామాలు చేయాలి

క్యాల్షియం, విటమిన్ డీ, సీ, ఫ్యాటీ యాసిడ్ ఉన్న పోషకాహారం తీసుకోవాలి

ముఖ్యంగా చేపలు, ఆకు కూరలు, డెయిరీ పదార్థాలు తీసుకోవాలి.

కూర్చునేటప్పుడు సరైన భంగిమలో ముఖ్యంగా పనిప్రదేశంలో సరిగ్గా ఉండాలి.

ఒకే చోట కదలకుండా ఎక్కువ సేపు కూర్చోకుండా మధ్యలో విరామం తీసుకోవాలి.

కీళ్ల నొప్పులు వచ్చే వ్యాయామం, పనులు ఎక్కువగా చేయకూడదు.

# ఒక్క అల్లం ముక్క మీ తలనొప్పిని తరిమేస్తుందా



హెల్త్ న్యూస్ ,12 మార్చి (క్రాంతిన్యూస్ ):పని ఒత్తిడి, అలసట, ఆందోళన, నిద్రలేమి ఇవన్నీ తలనొప్పికి కారణాలే. అయితే, సాధారణంగా వచ్చే తలనొప్పి తొందరగానే తగ్గిపోతుంది. కానీ మైగ్రేన్ వచ్చిందంటే మాత్రం ఆ బాధ భయంకరంగా ఉంటుంది. రోజుల తరబడి ఇబ్బంది పెడుతూనే ఉంటుంది. ఈ సమస్యకు పూర్తి చికిత్స లేకపోయినా, ఆహారపు అలవాట్లలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా ముఖ్యంగా అల్లాన్ని డైట్?లో చేర్చుకోవడం వల్ల మైగ్రేన్ నుంచి కొంత మేర ఉపశమనం పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం.

**మైగ్రేన్ లక్షణాలు:**

ఒక వైపు మాత్రమే తీవ్రమైన తలనొప్పి. చిరాకు, వాంతులు, వికారం, కంటిచూపు సరిగా ఉండకపోవడం, అలసట, కాళ్ళు, చేతులలో తిమ్మిర్లు వంటి లక్షణాలు చాలా ఇబ్బంది పెడుతుంటాయి.

**అల్లంతో ఎలా చెక్ పెట్టొచ్చు?:**

అల్లంలోని జింజెరోల్ అనే సమ్మేళనం మైగ్రేన్‌కు కారణమయ్యే మెదడులోని వాపును తగ్గించడంలో సహాయపడుతుందని నిపుణులు అంటున్నారు. అంతేకాకుండా మైగ్రేన్‌తో బాధపడే చాలా మందికి వికారం, వాంతుల సమస్యలు కూడా ఉంటాయి. వాటిని తగ్గించడంలో కూడా అల్లం సహాయపడుతుందని చెబుతున్నారు. నేషనల్? ఇన్?స్టిట్యూట్? ఆఫ్? హెల్త్?కు సంబంధించిన నేషనల్? లైబ్రరీ ఆఫ్? మెడిసిన్?లో కూడా ఈ విషయం ప్రచురితమైంది

అల్లం ను ఆహారంలో ఎలా చేర్చుకోవాలి: అల్లం ను వివిధ రూపాల్లో ఆహారంలో భాగం చేసుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. అందులో కొన్ని చూస్తే..

**అల్లం టీ తయారు చేసుకొని తాగండి**

అల్లంతో మీకు నచ్చినట్టు సూప్? చేసుకోవచ్చు

అల్లం పచ్చడి కూడా బాగుంటుంది

ఇంకా జెల్, పౌడర్, ఆయిల్ రూపంలో తీసుకోవచ్చు

ఈ ఫుడ్స్‌తో కూడా: మైగ్రేన్‌తో బాధపడేవారు కీటోజెనిక్ డైట్, మాడిఫైడ్ అట్కిన్స్ డైట్ అనేవి ఫాలో అవ్వాలని కొందరు నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే, ఈ రెండు రకాల డైట్స్ ఫాలో అయిన వారిలో మైగ్రేన్ ఎటాక్స్ చాలా వరకు తగ్గినట్లు, కొంతమందిలో మొత్తం మైగ్రేన్ వానిష్ అయినట్టు చెబుతున్నారు.

కీటోజెనిక్ డైట్‌లో ఫ్యాట్ కంటెంట్ అధిక శాతం ఉండి, కార్బోహైడ్రేట్ కంటెంట్ తక్కువ ఉంటుంది. ఇందులో ఓమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ కూడా పుష్కలంగా ఉంటాయి. ఈ డైట్?లోని యాంటీ ఇన్?ఫ్లమేటరీ గుణాలు మంచి న్యూరోప్రొటెక్టివ్?గా పనిచేస్తాయంటున్నారు. ఎందుకంటే, మైగ్రేన్ అనేది బ్రెయిన్ రిలేటివ్ ప్రాబ్లమ్ కాబట్టి ఈ డైట్?ను ఫాలో అవ్వడం ద్వారా ఇన్?ఫ్లమేషన్?ను తగ్గిస్తూ మనకు మంచి సెరటోనిన్ ప్రొడ్యూస్ చేయడానికి ఎంతగానో తోడ్పడుతుందంటున్నారు. ఇదే విషయాన్ని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్?లో కూడా ప్రచురితమైంది

కీటోజెనిక్ డైట్ లోకి..

ఆలివ్ ఆయిల్, నెయ్యి, ఆవకాడో, గింజలు, విత్తనాలు, చేపలు, మాంసం, గుడ్లు, తక్కువ కార్బోహైడ్రేట్లు ఉన్న కూరగాయలు (బ్రోకలీ, కాలీఫ్లవర్, బచ్చలికూర) వంటివి వస్తాయి.

# బీసీసీఐ చెప్పిందంతా ఐసీసీ చేస్తుంది..

## విండీస్ దిగ్గజ బౌలర్ సంచలన ఆరోపణలు

స్పోర్ట్స్ న్యూస్ ,12 మార్చి (క్రాంతిన్యూస్ ):ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా గెలవడాన్ని పాకిస్తాన్ వాళ్లే కాకుండా ఇతర దేశాల వాళ్లు కూడా జీర్ణించుకోలేకపోతున్నారు. మెగా టోర్నీలో టీమిండియా తమ మ్యాచ్‌లన్నీ ఒకే వేదికపై ఆడి లబ్ది పొందిందని కొన్ని భారత వ్యతిరేక శక్తులు



అవాక్కులు చవాక్కులు పేలుతున్నాయి. తాజాగా ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో ప్రాతినిథ్యమే లేని విండీస్ కూడా ఈ అంశంపై నోరు మెదపడం మొదలుపెట్టింది.

భారత్ దుబాయ్‌లోనే తమ మ్యాచ్‌లన్నీ ఆడటాన్ని విండీస్ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ ఆండీ రాబర్ట్స్ తప్పుబట్టాడు. మిగతా జట్లు మైళ్లకు మైళు ప్రయాణించి మ్యాచ్‌లు ఆడితే, టీమిండియా మాత్రం కాలు కదపకుండా ఒకే వేదికపై అన్ని మ్యాచ్‌లు? ఆడిందని అన్నాడు. టోర్నీకి ఆతిథ్యమిచ్చినా పాకిస్తాన్ కూడా టీమిండియాతో మ్యాచ్‌కు దుబాయ్‌కు వెళ్లిందని గుర్తు చేశాడు.

ఇలాంటప్పుడు పాక్ జట్టుకు ఆతిథ్య సౌలభ్యం ఎక్కడ లభించిందని ప్రశ్నించాడు. ఒకే వేదికపై టీమిండియా మ్యాచ్‌లు షెడ్యూల్ చేసినందుకు ఐసీసీపై కూడా ధ్వజమెత్తాడు. బీసీసీఐ ప్రతి కోరికను తీర్చడాన్ని ఐసీసీ మానుకోవాలని సూచించాడు. ఛాంపియన్స్ ట్రోఫీ తటస్థ వేదిక (దుబాయ్) విషయంలో ఐసీసీ బీసీసీఐకి అనుకూలంగా వ్యవహరించిందని మండిపడ్డాడు.

ఒకే వేదికపై అన్ని మ్యాచ్‌లు ఆడటం ద్వారా టీమిండియా లబ్ది పొందిందని ఆరోపించాడు. ఈ విషయంలో మిగతా జట్లకు అన్యాయం జరిగిందని వాపోయాడు. ఇకనైనా ఐసీసీ బీసీసీఐకి సహకరించడం మానుకోవాలని అన్నాడు. 2024 టీ20 వరల్డ్‌కప్‌లోనూ ఓ విషయంలో ఐసీసీ బీసీసీఐకి సహకరించిందని నిరాధార ఆరోపణ చేశాడు. టీమిండియా కోసం బీసీసీఐ చేసే ప్రతి అభ్యర్థనను నెరవేర్చకూడదని ఐసీసీకి సూచించాడు.

అప్పుడప్పుడైనా బీసీసీఐకి నో చెప్పాలని వ్యంగ్యంగా అన్నాడు. ప్రపంచంలో బీసీసీఐ ధనిక బోర్డు కావడంతో ఐసీసీ వారి చెప్పినట్లల్లా ఆడుతుందని అన్నాడు. తనవరకు ఐసీసీ అంటే ఇండియన్ క్రికెట్ బోర్డు అని ఎద్దేవా చేశాడు. బీసీసీఐ ప్రతి విషయంలో ఐసీసీని శాశిస్తుందని తెలిపాడు. రేపటి రోజుల్లో బీసీసీఐ నో బాల్స్ వద్దు, వైడ్ బాల్స్ వద్దన్నా ఐసీసీ తలూపుతుందని అన్నాడు.

బీసీసీఐని తృప్తి పరిచేం?దుకు ఐసీసీ ఏమైనా చేస్తుందని అన్నాడు. 74 ఏళ్ల ఆండీ రాబర్ట్స్ తొలి మూడు వన్డే ప్రపంచకప్ టోర్నీల్లో విండీస్ జట్టులో కీలక సభ్యుడిగా ఉన్నాడు. ఈ మూడింటిలో విండీస్ తొలి రెండు ప్రపంచకప్‌లను గెలిచింది. 1983 వరల్డ్‌కప్‌లో కపిల్ దేవ్ నేతృత్వంలోని భారత జట్టు ఫైనల్లో విండీస్‌ను చిత్తు చేసి ఛాంపియన్‌గా అవతరించింది. నేడు రాబర్ట్స్ చేసిన వ్యాఖ్యలు నాటి ప్రపంచకప్ అవమానాన్ని దృష్టిలో పెట్టుకుని చేసినట్లుంది.

కాగా, రాబర్ట్స్ లేవనెత్తిన విషయాన్నే ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైక్ అథర్టన్ కూడా లేవనెత్తాడు. ఒకే వేదికపై ఆడి, ఎలాంటి ప్రయాణ బడలికలు లేకుండా టీమిండియా లబ్ది పొందిందని సోషల్‌మీడియా వేదికగా ఆరోపించాడు.

అయితే ఒకే వేదికపై మ్యాచ్‌లు ఆడటం వల్ల టీమిండియాకు అదనంగా ఒరిగిందేమీ లేదని పాక్ మాజీ కెప్టెన్ వసీం అక్రం అనడం విశేషం. ఈ టోర్నీలో భారత్ వేదికతో సంబంధం లేకుండా చాలా బలంగా ఉండిందని అక్రం అన్నాడు. ఈ జట్టుతో భారత్ పాకిస్తాన్‌లో కూడా గెలిచేదని తెలిపాడు.

కాగా, ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ అన్ని మ్యాచ్‌లను దుబాయ్‌లో అడి అన్నింటా విజయాలు సాధించింది. ఫైనల్లో టీమిండియా న్యూజిలాండ్‌ను చిత్తు చేసి మూడోసారి ఛాంపియన్స్ ట్రోఫీని ఎగరేసుకుపోయింది. వాస్తవానికి ఈ టోర్నీకి పాక్ ఆతిథ్యమిస్తున్నప్పటికీ.. భద్రతా కారణాల రిత్యా టీమిండియా పాక్‌లో పర్యటించడానికి బీసీసీఐ ఒప్పుకోలేదు. సుదీర్ఘ చర్చల అనంతరం ఐసీసీ టీమిండియా మ్యాచ్‌లను దుబాయ్‌కు మార్చింది.

# ఇలా అయితే వరల్డ్ ఎలెవెన్‌పై కూడా గెలుస్తారు..

## టీమిండియాపై పాక్ మాజీ ప్రశంసల వర్షం

స్పోర్ట్స్ న్యూస్ ,12 మార్చి (క్రాంతిన్యూస్ ):ఛాంపియన్స్ ట్రోఫీ-2025 గెలిచిన టీమిండియాపై పాకిస్తాన్ దిగ్గజ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిది ప్రశంసల వర్షం? కురిపించాడు. ఈ జట్టుతో భారత్ వరల్డ్ ఎలెవెన్‌పై కూడా సునాయాసంగా గెలుస్తుందని కితాబునిచ్చాడు. ఛాంపియన్స్‌గా నిలిచేందుకు టీమిండియా ఆటగాళ్లు వంద శాతం అర్హులని కొనియాడాడు.




ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత సెలెక్టర్లు సరైన జట్టును ఎంపిక చేశారని అన్నాడు. వారు దుబాయ్‌లో పరిస్థితులను ముందుగానే అంచనా వేసి స్పిన్ లోడ్‌తో బరిలోకి దిగారని తెలిపాడు. ఒకే వేదికపై ఆడటం భారత్‌కు కలిసొచ్చిందని అంటూనే ట్రోఫీ విజయంలో సెలెక్టర్ల పాత్ర అమోఘమని కితాబునిచ్చాడు.

దుబాయ్‌లో స్పిన్నర్ల పాత్ర చాలా కీలకమని తెలిపాడు. తనకు అ?క్కడ ఆడిన అనుభవం ఉంది కాబట్టి స్పిన్నర్ల పాత్ర గురించి తెలుసని చెప్పాడు. కేవలం స్పిన్నర్లే కాకుండా టీమిండియా మొత్తం పటిష్టంగా ఉందని అన్నాడు. ఈ జట్టుతో ప్రపంచంలో ఏ జట్టునైనా ఓడించవచ్చని తెలిపాడు.

తమ అత్యుత్తమ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా లేకపోయినా ఈ టోర్నీలో భారత్ అన్ని మ్యాచ్‌లు గెలిచిందని గుర్తు చేశాడు. వన్డే ఫార్మాట్‌లో ఘనమైన ట్రాక్ రికార్డు కలిగిన మహ్మద్ సిరాజ్‌ను ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేయకుండా భారత సెలెక్టర్లు సాహసోపేత నిర్ణయం? తీసుకున్నారని అన్నాడు.

నలుగురు స్పిన్నర్లకు ఆడించడం టీమిండియా వర్కౌట్ అయ్యిందని తెలిపాడు. ఈ టోర్నీలో పాకిస్తాన్ ఒకే ఒక స్పెషలిస్ట్ స్పిన్నర్‌తో (అబ్రార్ అహ్మద్) బరిలోకి దిగి పెద్ద తప్పు చేసిందని అభిప్రాయపడ్డాడు.

కాగా, పాకిస్తాన్ ఆతిథ్యం ఇచ్చిన ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో భారత్ అజేయ జట్టుగా నిలిచి ఛాంపియన్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ టోర్నీలో భారత్ గ్రూప్ దశలో బంగ్లాదేశ్, పాకిస్తాన్, న్యూజిలాండ్‌లపై విజయాలు సాధించి, సెమీస్‌లో ఆస్ట్రేలియా, ఫైనల్స్‌లో న్యూజిలాండ్‌ను మట్టికరిపించి, ముచ్చటగా మూడోసారి టైటిల్‌ను ఎగరేంసుకుపోయింది. మరోవైపు డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి పాకిస్తాన్ కనీసం ఒక్క మ్యాచ్ కూడా గెలవలేక? గ్రూప్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది.

పాక్ సొంతగడ్డపై ఆడుతున్న అడ్వాంటేజ్‌ను కూడా పొందలేక గ్రూప్ దశలో ఆడిన 3 మ్యాచ్‌ల్లో రెండింట (న్యూజిలాండ్, భారత్ చేతుల్లో) ఓడింది. బంగ్లాదేశ్‌తో జరగాల్సిన మ్యాచ్ వర్షం? కారణంగా రద్దైంది. సొంతగడ్డపై డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగి కనీసం ఒక్క మ్యాచ్ కూడా గెలవకపోవడంతో పాక్‌కు సొంత అభిమానుల నుంచే ఛీదరింపులు ఎదురవుతున్నాయి.

ఆ దేశ మాజీలు పాక్ జట్టుపై దుమ్మెత్తిపోస్తున్నారు. జట్టును ఎంపిక చేసిన సెలెక్టర్లను తూర్పారబెడుతున్నారు. పాక్ మాజీలు పాక్ ఓడిపోయిన దానికంటే తమ దేశం ఆతిథ్యమిచ్చిన టోర్నీలో భారత్ గెలిచినందుకు ఎక్కువగా బాధపడుతున్నారు. పైకి టీమిండియాను పొగుడుతున్నట్లు నటిస్తున్నప్పటికీ లోలోపల కుమిలిపోతున్నారు.

# రెజ్లింగ్ సమాఖ్యపై నిషేధం ఎత్తివేత

స్పోర్ట్స్ న్యూస్ ,12 మార్చి (క్రాంతిన్యూస్ ):భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)పై గత కొన్నినెలలుగా నిరాటంకంగా కొనసాగుతున్న నిషేధాన్ని కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఎత్తేసింది. 2023, డిసెంబర్ 24న డబ్ల్యూఎఫ్ఐపై సస్పెన్షన్ వేటు వేసిన కేంద్రం.. మంగళవారం దానిని తొలగించింది. ఇన్నాళ్లూ డబ్ల్యూఎఫ్ఐ కార్యకలాపాలను అడ్‌హక్ కమిటీ పర్యవేక్షించింది. దేశంలో రెజ్లింగ్ పోటీల నిర్వహణ, అంతర్జాతీయ టోర్నమెంట్లకు జట్ల ఎంపిక నిమిత్తం కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.



త్వరలో ఆసియన్ చాంపియన్‌షిప్స్ జరగాల్సి ఉన్న నేపథ్యంలో తాజా నిర్ణయం రెజ్లర్లకు ఊరటనిచ్చింది. లైంగిక వేధింపుల ఆరోపణలతో పదవీచ్యుతుడైన మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్ స్థానంలో సమాఖ్యకు ఎన్నిక నిర్వహించగా ఆ స్థానాన్ని అతడి అనుచరుడైన సంజయ్ సింగ్ గెలవడం.. గెలిచిన వెంటనే పాలకవర్గం అత్యుత్సాహం ప్రదర్శించిన నేపథ్యంలో కేంద్రం డబ్ల్యూఎఫ్ఐపై నిషేధం విధించిన విషయం విదితమే.

# సేన్ ముందుకు.. ప్రణయ్ ఇంటికి..

స్పోర్ట్స్ న్యూస్ ,12 మార్చి (క్రాంతిన్యూస్ ):ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో తొలి రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. పురుషుల సింగిల్స్‌లో బరిలోకి దిగిన హెచ్ఎస్ ప్రణయ్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా లక్ష్యసేన్ రెండో రౌండ్‌కు అర్హత సాధించాడు. ప్రపంచ 15వ ర్యాంకర్ అయిన లక్ష్యసేన్.. 13-21, 21-17, 21-15తో సులి యాంగ్ (చైనీస్ తైఫీ)ను మట్టి కరిపించాడు.




రెండో రౌండ్‌లో లక్ష్యసేన్.. ఇండోనేషియా మూడో సీడ్ ఆటగాడు జొనాథన్ క్రిస్టీతో తలపడాల్సి ఉంది. ఇక ప్రణయ్.. 19-21, 16-21తో పోపోవ్ (ఫ్రాన్స్) చేతిలో పరాభవం పాలయ్యాడు. 53 నిమిషాల్లోనే ముగిసిన పోరులో ప్రణయ్ తొలి గేమ్‌లో పోరాడినా రెండో గేమ్‌లో తేలిపోయాడు. మహిళల సింగిల్స్‌లో యువ షట్లర్ మాళవిక బన్సోద్.. 21-13, 10-21, 21-17తో యో జియో మిన్ (సింగపూర్)ను ఓడించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సతీశ్ కుమార్-ఆద్య వరియత్ జంట కూడా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది.

KR TV క్రాంతి

గురువారం 13 మార్చి 2025

# సినిమా న్యూస్

epaper.krtvnews.com


## ఆ సమయంలో నూడుల్స్ తిని బతికాం:



మూవీ న్యూస్ ,12 మార్చి (క్రాంతిన్యూస్ ): మోడలింగ్‌లోకి అడుగుపెట్టిన సమయంలో తాను ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నట్లు గుర్తుచేసుకున్నారు నటి దియా మీర్జా . ఆ సమయంలో చేతిలో డబ్బుల్లేక ఇబ్బందిపడ్డానని ఆమె అన్నారు. కుటుంబసభ్యుల నుంచి అంతగా సపోర్ట్ ఉండేది కాదన్నారు. చాలీచాలని డబ్బుతో జీవితాన్ని కొనసాగించానని తెలిపారు.

"2000లో నేను, ప్రియాంకా చోప్రా, లారా దత్తా.. మిస్ ఇండియా పోటీల్లో పాల్గొన్న విషయం అందరికీ తెలిసిందే. ప్రియాంకకు కుటుంబసభ్యుల నుంచి ఎంతో సపోర్ట్ ఉండేది. మాకు సపోర్ట్ చేయడానికి ఎవరూ ఉండేవారు కాదు. మోడలింగ్‌లో రాణిస్తోన్న కారణంగా అప్పటికే లారా ముంబయిలో ఒక ఇరికింట్లో అద్దెకు ఉండేది. నేను ముంబయి వచ్చినప్పుడు.. ఆమె నాకెంతో సాయంగా నిలిచింది. తన రూమ్‌లో ఉండేందుకు అవకాశం కల్పించింది. చిన్న ఇల్లే అయినప్పటికీ మేమిద్దరం సర్దుకుపోయాం. ఫ్యాషన్ షోల్లో పాల్గొని.. ఖరీదైన దుస్తులు ధరించినప్పటికీ ఒక్కోసారి చేతిలో చిల్లిగవ్వ ఉండేది కాదు. చాలీచాలని డబ్బుతోనే జీవితాన్ని కొనసాగించాం. కొన్నిసార్లు నూడుల్స్ తిని రోజులు గడిపాం. మా పరిస్థితిని తలుచుకొని నవ్వుకునేవాళ్లం. ఖరీదైన దుస్తులు వేసుకున్నా.. తినేది మాత్రం నూడుల్స్ అనుకునేవాళ్లం" అని దియామీర్జా ఆ రోజులను గుర్తు చేసుకున్నారు.

## రంగస్థల యోధులకు అంకితం



మూవీ న్యూస్ ,12 మార్చి (క్రాంతిన్యూస్ ):ముగ్గురి జీవితాల్ని ఓ క్రికెట్ మ్యాచ్ ఎలాంటి మలుపులు తిప్పిందనే కథాంశం ఆధారంగా రూపొందిన చిత్రం 'టెస్ట్'. అగ్ర కథానాయిక నయనతార, ఆర్.మాధవన్, సిద్ధార్థ్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ స్పోర్ట్స్ డ్రామాను ఎస్ శశికాంత్ తెరకెక్కించారు. తాజాగా ఈ సినిమాలోని 'అరేనా..' అంటూ సాగే పాటను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. మన రంగస్థలంలోని పోరాట యోధులకు ఈ చిత్రాన్ని అంకితం చేస్తున్నట్లు తెలుపుతూ మొదలైందీ గీతం. మన దేశాన్ని ప్రపంచ వేదికపై నిలబెట్టడానికి కష్టపడిన ఎంతో మంది క్రికెటర్లను ఉద్దేశించి సాగుతున్న ఈ పాట సినీప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. వైనాట్ స్టూడియోస్ నిర్మించిన ఈ సినిమా వచ్చే నెల 4న ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది.

## ఓటీటీలోకి 'ముఫాసా: ది లయన్ కింగ్'..




మూవీ న్యూస్ ,12 మార్చి (క్రాంతిన్యూస్ ):ఓ రాజ్యం.. రాజు.. యువరాజు.. అక్కడ సింహాసనం కోసం జరిగే ఎత్తులకు పైఎత్తులు.. ఇవన్నీ మనం చాలా సినిమాల్లో చూసే ఉంటాం. ఇలాంటి కథతో తెరకెక్కిన చిత్రమే 'ముఫాసా: ది లయన్ కింగ్' . ప్రముఖ హాలీవుడ్ సంస్థ డిస్నీ రూపొందించిన ఈ మ్యూజికల్ లైవ్ యాక్షన్ చిత్రం గతేడాది విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇంగ్లీష్‌తోపాటు పలు భారతీయ భాషల్లోనూ ఈ సినిమా నిర్మితమైంది. సినిమాలో కీలకమైన ముఫాసా పాత్రకు తెలుగులో అగ్ర కథానాయకుడు మహేశ్‌బాబు.. హిందీలో షారుక్ ఖాన్ డబ్బింగ్ చెప్పిన విషయం తెలిసిందే.

ఇప్పుడీ చిత్రం ఓటీటీ వేదికగా ప్రేక్షకులకు మరోసారి వినోదం పంచేందుకు సిద్ధమైంది. జియో హాట్‌స్టార్ వేదికగా మార్చి 26 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది. ఇంగ్లిష్‌తో పాటు తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఇది అందుబాటులో ఉండనుందని తాజాగా ఓటీటీ సంస్థ ప్రకటించింది. 2019లో విడుదలైన 'ది లయన్ కింగ్'కు ప్రీక్వెల్‌గా వచ్చిన చిత్రమిది. ముఫాసా అసలు రాజుగా ఎలా మారాడు? ఆయన గత చరిత్ర ఏంటి? అనే అంశాలను ఈ సినిమాలో చూపించారు.

## మోహన్‌బాబుతో మాకెలాంటి ఆస్తి గొడవలు లేవు: సౌందర్య భర్త

మూవీ న్యూస్ ,12 మార్చి (క్రాంతిన్యూస్ ):సీనియర్ నటుడు మోహన్‌బాబుతో తమకెలాంటి ఆస్తిగొడవలు లేవని దివంగత నటి సౌందర్య భర్త రఘు అన్నారు. సౌందర్య మరణం ప్రమాదవశాత్తూ జరిగింది కాదంటూ సామాజిక మాధ్యమాల వేదికగా వార్తలు వైరల్ అయ్యాయి. ముఖ్యంగా మోహన్‌బాబు పేరు ఉపయోగిస్తూ పోస్టులు దర్శనమిచ్చాయి. దీంతో ఆయనకు మద్దతుగా సౌందర్య భర్త రఘు బహిరంగ లేఖ విడుదల చేశారు.





"హైదరాబాద్‌లోని సౌందర్య ఆస్తికి సంబంధించి కొన్ని రోజులుగా తప్పుడు ప్రచారం జరుగుతోంది. ఆమె ఆస్తిని నటుడు మోహన్‌బాబు ఆక్రమించుకున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నా. ఆయనతో సౌందర్య ఎలాంటి భూ లావాదేవీలు జరపలేదు. వారి కుటుంబంతో మాకు 25 ఏళ్లుగా మంచి అనుబంధం ఉంది. నేను మోహన్‌బాబును ఎంతో గౌరవిస్తా. మేమంతా ఒకే కుటుంబంగా ఉంటాం. మాకెలాంటి ఆస్తి గొడవలు, లావాదేవీలు లేవు" అని పేర్కొన్నారు.


## మళ్లీ రానున్న దొంగ నోట్ల ముఠా



మూవీ న్యూస్ ,12 మార్చి (క్రాంతిన్యూస్ ):కథ బాగుంటే ఐదారు గంటల నిడివిగల వెబ్‌సిరీస్‌లను సైతం అలవోకగా చూస్తుంటారు సినీప్రియులు. ఆ కోవకు చెందిందే 'ఫర్జీ' సిరీస్. రాజ్, డీకే దర్శకత్వంలో బాలీవుడ్ కథానాయకుడు షాహిద్ కపూర్, రాశీ ఖన్నా తదితరులు నటించిన ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్‌లో విడుదలై విశేష ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. ఏ పెయింటింగ్‌నైనా అచ్చుగుద్దినట్లు గీయగల ప్రతిభ ఉన్న ఓ యువకుడు దొంగ నోట్లను ఎందుకు ముద్రించాలనుకున్నాడనే కథాంశం ఆధారంగా దీన్ని రూపొందించారు. దీనికి సీక్వెల్ రాబోతున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. దీని గురించి కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుంది రాశీ ఖన్నా. "ప్రేక్షకులు 'ఫర్జీ 2' కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని తెలుసు. ప్రస్తుతం దీనికి సంబంధించిన స్క్రిప్ట్ పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది ఆఖర్లో మేము చిత్రీకరణను ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాము. తొలి భాగం కన్నా ఉత్కంఠభరితమైన సన్నివేశాలు, ట్విస్ట్‌లతో త్వరలో మీ ముందుకు రాబోతున్నాం" అని చెప్పుకొచ్చింది.

## అందుకే వేరే పరిశ్రమపై దృష్టి పెట్టలేదు: మోహన్‌లాల్

మూవీ న్యూస్ ,12 మార్చి (క్రాంతిన్యూస్ ): ఇండస్ట్రీలో సూపర్ స్టార్‌గా ఎదగడం కంటే ఆ స్టార్‌డమ్‌ను నిలబెట్టుకోవడం కష్టం. మలయాళ హీరో మోహన్‌లాల్ ఇప్పటికీ నాలుగున్నర దశాబ్దాలుగా అగ్ర కథానాయకుడిగా కొనసాగుతున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తనకు ఇంత గుర్తింపు రావడానికి కారణం మలయాళ పరిశ్రమ అని, అందుకే దీన్ని వీడి మరో పరిశ్రమపై దృష్టిపెట్టలేదని తెలిపారు. మలయాళ ప్రేక్షకులు మంచి కంటెంట్ ఉన్న సినిమాలను ఎప్పుడూ ఆదరిస్తారన్నారు.



మలయాళంలో నటించడం వల్లే మీకు గుర్తింపు వచ్చిందని భావిస్తున్నారా అనే ప్రశ్నకు మోహన్‌లాల్ ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా అవునన్నారు. "ఇతర భాషల్లో అవకాశాలను వెతుక్కుంటూ వెళ్లకుండా ఇక్కడే నటించాలని నిర్ణయించుకున్నాను. ఇతర భాషల్లో ఎన్నో అవకాశాలు వచ్చాయి. మలయాళ పరిశ్రమ ఉత్తమ చిత్రాలను తెరకెక్కిస్తుంది. సాంకేతికంగానూ అభివృద్ధి చెందాం. ఇక్కడి ప్రేక్షకులకు సినిమాలపై ఉన్న అభిమానం వల్లే గొప్ప చిత్రాలు వస్తున్నాయి. కళాత్మక చిత్రాలు నిర్మించడంలోనూ ఈ ఇండస్ట్రీ ఎప్పుడూ ముందుంటుంది. అందుకే ఇతర పరిశ్రమలతో పోలిస్తే ఇక్కడ గొప్ప సినిమాలు తెరకెక్కుతున్నాయి. ఈ మార్పు రాత్రికి రాత్రే వచ్చింది కాదు.. కాలక్రమేణా అభివృద్ధి చెందింది. ఇలాంటి గొప్ప పరిశ్రమలో భాగమైన నేను మరో ఇండస్ట్రీ వైపు ఎందుకు చూడాలి?" అని మోహన్‌లాల్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఒకవైపు హీరోగా వరుస సినిమాలతో అలరిస్తూనే తాజాగా దర్శకత్వంలోనూ తన ప్రతిభ చూపారు మోహన్‌లాల్. 'బరోజ్ 3డీ' అనే చిత్రాన్ని తెరకెక్కించారు. గతేడాది విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంది.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com